12 YEARS PEN POWER JOURNEY 2014 - 2026
ప్రశ్నించడం మన హక్కు
విశాఖపట్నం | హైదరాబాద్ | ఉభయ గోదావరి | ఎన్. టీ. ఆర్ | గుంటూరు
ప్రకాశం | నెల్లూరు | తిరుపతి | చిత్తూరు | కడప

# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు

సంపుటి : 1 సంచిక : 327 పేజీలు : 8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) పచురణ : తాడేపల్లిగూడెం గురువారం 1 అక్టోబర్ 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 327 PAGES : 8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : THADEPALLI GUDEM THU 1 OCTOBER 2026 PRICE : 1/- RS

Simultaneously Published form : Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur




- 93 ఏళ్ల ఘన చరిత్ర కలిగిన విశాఖ పోర్టులో అసలేం జరుగుతోంది?
- దేశ ఆర్థిక వ్యవస్థకు వాణిజ్య ద్వారం... ఇప్పుడు పరిపాలనా వ్యవస్థపై ప్రశ్నలు
- కేంద్ర ప్రభుత్వ పరిధిలోని మేజర్ పోర్టా?.. కొందరు అధికారుల 'ప్రైవేట్ సామ్రాజ్యమా?'
- పైస్థాయి పెత్తనం కింద కిందిస్థాయి ఉద్యోగుల గొంతు నలిగిపోతోందా?
- కమర్షియల్ నిర్ణయాల్లో పారదర్శకత ఎంత?.. వ్యక్తిగత ప్రభావం ఎంత?
- బెర్త్ కేటాయింపు నుంచి కార్గో హ్యాండ్లింగ్ వరకు... నిర్ణయాల వెనుక అసలు వ్యవస్థ ఏమిటి?
- ఫైళ్లు తెరిస్తే కనిపించేది పారదర్శకతా?.. మరో కథా?

**'పెన్ పవర్' గ్రాండ్ రిపోర్ట్ - - ఎపిసోడ్-1**

వివరాలు 2లో..

## రష్యా సైన్యంలో చేరొద్దు..
## అది చాలా ప్రమాదకరం!
### భారతీయులకు కేంద్రం తీవ్ర హెచ్చరిక



- డబ్బు ఆశతో ప్రమాదకర మార్గంలో వెళ్లొద్దని సూచన
- పౌరసత్వం వదులుకుని మరీ కొందరు సైన్యంలో చేరుతున్నారని ఆందోళన
- ఇప్పటివరకు 139 మందిని సురక్షితంగా వెనక్కి రప్పించినట్లు వెల్లడి
- మిగిలిన వారిని రప్పించేందుకు ప్రయత్నాలు కొనసాగుతున్నాయని స్పష్టీకరణ

- మిగతా 2లో

# మహిళలకు ఏసీ బస్సుల్లోనూ
# ఉచిత ప్రయాణం

- విజయవాడలో 'పేదలకు పట్టాభిషేకం' కార్యక్రమం
- 120 ఏళ్ల నాటి సమస్యకు పరిష్కారం చూపినట్లు తెలిపిన సీఎం
- రాష్ట్రవ్యాప్తంగా 26,401 మందికి ఇళ్ల పట్టాల పంపిణీ

**పెన్ పవర్ డెస్క్:**తమ ప్రభుత్వం 120 ఏళ్ల నాటి ఇళ్ల స్థలాల పట్టాల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. విజయవాడలోని మకినేని బసవపున్నయ్య స్టేడియంలో నిర్వహించిన 'పేదలకు పట్టాభిషేకం' కార్యక్రమంలో ఆయన లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సొంత ఇల్లు అనేది పేదల జీవితకాల స్వప్నమని, దీని కోసం 40 నుంచి 50 ఏళ్లుగా ఎదురుచూస్తున్న వారు ఎందరో ఉన్నారని తెలిపారు.ఈ కార్యక్రమంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 26,401 మంది అర్హులైన లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను అందజేశారు. ఎన్టీఆర్

- మిగతా 2లో





## మోదీ-ట్రంప్ ఫోన్ కాల్..
## వాణిజ్యం, రక్షణ, ఇంధనంపై కీలక చర్చలు

- వ్యూహాత్మక భాగస్వామ్యంపై చర్చ
- ప్రాంతీయ పరిణామాలపై అభిప్రాయాల మార్పిడి
- ప్రపంచ శాంతి, భద్రతపై చర్చ
- సన్నిహిత సంబంధాలు కొనసాగించేందుకు అంగీకారం

**పెన్ పవర్ డెస్క్:**ప్రధాని నరేంద్ర మోదీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బుధవారం ఫోన్‌లో మాట్లాడుకున్నారు. ఈ సందర్భంగా భారత్–అమెరికా ద్వైపాక్షిక సంబంధాల్లో కీలకమైన అంశాలపై చర్చించారు. వాణిజ్యం, రక్షణ, ఇంధనం, కీలక సాంకేతికతల రంగాల్లో ఇరు దేశాల సహకారాన్ని సమీక్షించినట్లు మోదీ తెలిపారు. ట్రంప్‌తో జరిగిన చర్చలు ఫలప్రదంగా సాగాయని మోదీ 'ఎక్స్'లో వెల్లడించారు. భారత్–అమెరికా సమగ్ర గ్లోబల్ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు సన్నిహితంగా కొనసాగాలని ఇరు దేశాల నేతలు అంగీకరించినట్లు తెలిపారు. ప్రాంతీయ, అంతర్జాతీయ పరిణామాలపైనా ఇద్దరూ అభిప్రాయాలను పంచుకున్నారు. ప్రపంచ శాంతి, భద్రతను ముందుకు తీసుకెళ్లేందుకు జరుగుతున్న ప్రయత్నాలపై

- మిగతా 2లో



## విమానాన్ని కూల్చివేసేందుకు
## యత్నించాడు

**పెన్ పవర్ డెస్క్:** ఫ్లైదుబాయ్ విమానంలోని ఓ పైలట్.. తోటి పైలట్‌ను కత్తితో పొడిచి, విమానాన్ని కూల్చివేసేందుకు యత్నిం చాడని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు ఆరోపించారు. ప్రయాణికులు, సిబ్బంది కలిసి అతడిని కట్టడి చేసి.. పెను ప్రమాదాన్ని నివారించారని తెలిపారు.

- మిగతా 2లో

## తిరుపతి నుంచి వారణాసికి 25 బైక్‌లు..
## టీడీపీ నేతల సేవా సంకల్ప యాత్ర!

- సేవా సంకల్ప యాత్రను ప్రారంభించిన పల్లా శ్రీనివాసరావు
- తిరుపతి నుంచి వారణాసి వరకు బైక్ యాత్ర
- యాత్రలో పాల్గొంటున్న 25 మంది రైడర్లు
- టీఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో యాత్ర నిర్వహణ
- నాలుగు రాష్ట్రాల మీదుగా ఎనిమిది రోజుల ప్రయాణం

- మిగతా 2లో

**పెన్ పవర్ డెస్క్:**ప్రధాని నరేంద్ర మోదీ 25 ఏళ్ల ప్రజా జీవితాన్ని పూర్తి చేసుకున్న సందర్భంగా టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా తిరుపతి నుంచి వారణాసి వరకు చేపట్టిన 'సేవా సంకల్ప యాత్ర'ను



## 'బాబాయ్ హత్యతో అబ్బాయికే లాభం'..
## జగన్ మౌనంపై మంత్రి నిమ్మల ప్రశ్నలు



- వివేకా హత్యపై మంత్రి నిమ్మల తీవ్ర ఆరోపణలు
- కేసులో కీలక వ్యక్తుల మరణాలపై ప్రశ్నలు
- రూ.40 కోట్ల సుపారీ అంశాన్ని ప్రస్తావించిన మంత్రి
- ఈడీ అటాచ్‌మెంట్‌ను ప్రస్తావించిన నిమ్మల
- అజయ్ కల్లాం వాంగ్మూలాన్ని గుర్తుచేసిన మంత్రి

**పెన్ పవర్ డెస్క్:**వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో నిందితుడు సునీల్ యాదవ్ ఇచ్చిన వాంగ్మూలంపై మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎందుకు స్పందించడం లేదని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి

- మిగతా 2లో

## ఎడిటర్ వ్యూ

### లోకేశ్.. తీసుకున్న నిర్ణయంతో ఎమ్మెల్యేలు డమ్మీలుగా మారిపోయారా?

ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికలను టీడీపీ సీరియస్ గా తీసుకుంది. టీడీపీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ గా ఎన్నికయిన తర్వాత జరుగుతున్న ఎన్నికలు కావడంతో నారా లోకేశ్ ఈ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. నారా లోకేశ్ ఇప్పటికే ఎమ్మెల్యేలందరికీ స్పష్టమైన ఆదేశాలు అందచేశారు. విజయం మన వైపే ఉండాలని చెప్పారు. అలాగే అభ్యర్థుల ఎంపికలోనూ ఎమ్మెల్యేలకు అవకాశం ఇవ్వకుండా కేంద్ర పార్టీ కార్యాలయమే బాధ్యతలను తీసుకోవడం ఇప్పుడు పార్టీలో చర్చనీయంశమైంది. ఎమ్మెల్యేలు తమకు అనుకూలురైన వారిని ఎంపిక చేస్తారన్న అనుమానం లోకేశ్ కు వచ్చినట్లుంది. అలాగయితే పార్టీ కోసం కష్టపడుతూ, జెండా పట్టుకున్న వారికి అన్యాయం జరుగుతుందని భావించి లోకేశ్ ఈ నిర్ణయం తీసుకున్నారంటున్నారు. కానీ స్థానిక సంస్థల ఎన్నికల్లో అభ్యర్థులు ఎవరైనా వారిని గెలిపించుకుని రావాల్సిన బాధ్యత ఎమ్మెల్యేలపైనే పెట్టి లోకేశ్ వారికి పెద్ద బాధ్యతలను అప్పగించారు.

#### పార్టీ కార్యాలయంలోనే...

అభ్యర్థుల ఎంపికపై మంత్రి నారా లోకేశ్ పార్టీ కార్యాలయాల వేదికగా పారదర్శకమైన కసరత్తు నిర్వహించాలని కీలక నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. పార్టీ కేంద్ర కార్యాలయానికి మేయర్, ఛైర్మన్ల పేర్లను మూడింటిని పంపాలని, ప్రాధాన్యత క్రమంలో పంపాలని కోరారు. అలాగే కౌన్సిలర్ పేర్లను కూడా పంపాలని తెలిపారు. ప్రతి కౌన్సిలర్, మేయర్ , చైర్మన్ స్థానిక స్థానానికి ముగ్గురు సమర్థులైన అభ్యర్థుల పేర్లను పరిశీలన కోసం తెలపాలని సూచించారు. అభ్యర్థుల ఎంపికలో వారి రాజకీయ నేపథ్యం, పార్టీ కోసం వారు చేసిన సేవలు, క్షేత్రస్థాయిలో ప్రజాబలం మరియు నిజాయితీకి పెద్దపీట వేయాలని లోకేశ్ స్పష్టం చేశారు. అభ్యర్థుల ఎంపిక ప్రక్రియను కేవలం వ్యక్తిగత సిఫార్సులకే పరిమితం చేయకుండా, పార్టీ కార్యాలయాల స్థాయిలో అధికారికంగా నిర్వహించనున్నట్లు తెలుస్తోంది. దీనివల్ల నిజమైన కార్యకర్తలకు అన్యాయం జరగదని లోకేశ్ భావిస్తున్నారు.

#### ఎమ్మెల్యేలు నిర్ణయించిన వారే...

అయితే అభ్యర్థులను గెలిపించుకోవాలంటే ఎమ్మెల్యేలు తమకు అనుకూలురైన వారిని పోటీకి దింపి అవసరమైతే వారికి ఆర్థిక సాయాన్ని కూడా అందచేస్తారు. ఇలా పార్టీ కేంద్ర కార్యాలయం ఎంపిక చేస్తే ఎమ్మెల్యేలు ప్రచారానికే పరిమితమవుతారమోనన్న అనుమానం కూడా పార్టీ నాయకత్వంలో ఉంది. తమకు అనుకూలురైన వారైతే వచ్చే సాధారణ ఎన్నికల్లో తమకు కష్టపడి పనిచేస్తారని, అదే పార్టీ కేంద్ర నాయకత్వం ఎంపిక చేసిన వారయితే తమను ఎదిరించే అవకాశాలుంటాయన్న భావన కూడా ఎమ్మెల్యేల్లో ఉంది. ఎప్పుడైనా స్థానిక సంస్థలకు అభ్యర్థుల ఎంపిక ఎమ్మెల్యేల కనుసన్నల్లోనే జరుగుతుంది. కానీ నారా లోకేశ్ నేడు ఆ పద్ధతిని పూర్తిగా మార్చేశారు. అయితే ఇది కూటమి అభ్యర్థుల ఎంపిక విజయానికి దోహదపడుతుందా? లేక ఇబ్బందులు ఎదురవుతాయా? అన్న ప్రశ్నలు కూడా లేవనెత్తుతున్నాయి. అక్టోబర్‌లోనే స్థానిక సంస్థల ఎన్నికలు జరిగే అవకాశం ఉందని, వాయిదా పడతాయనే తప్పుడు ప్రచారాలను నమ్మకుండా నాయకులు, శ్రేణులు పూర్తిస్థాపనతో సిద్ధంగా ఉండాలని నారా లోకేశ్ దిశానిర్దేశం చేశారు. మొత్తం మీద నారా లోకేశ్ నిర్ణయంతో ఎమ్మెల్యేలు తాము డమ్మీలమయ్యామన్న భావనలో ఉన్నారు.

### రష్యా సైన్యంలో చేరొద్దు.. అది చాలా ప్రమాదకరం!

## భారతీయులకు కేంద్రం తీవ్ర హెచ్చరిక

రష్యా సైన్యంలో చేరడం అత్యంత ప్రమాదకరమని, అటువంటి నిర్ణయాలు తీసుకోవద్దని భారత ప్రభుత్వం తన పౌరులను మరోసారి గట్టిగా హెచ్చరించింది. ఉక్రెయిన్‌తో యుద్ధం కొనసాగుతున్న నేపథ్యంలో, ఆర్థిక ప్రయోజనాల కోసం ప్రాణాలను పణంగా పెట్టవద్దని సూచించింది. ఈ మేరకు కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖ బుధవారం ఒక ప్రకటన విడుదల చేసింది. గత రెండేళ్లుగా హెచ్చరికలు జారీ చేస్తున్నప్పటికీ, కొందరు భారతీయులు రష్యా సైన్యంలో చేరుతున్నట్లు నివేదికలు అందుతున్నాయని విదేశాంగ శాఖ పేర్కొంది. అధిక ఆదాయం వస్తుందన్న ఆశతో కొందరు స్వచ్ఛందంగా రష్యా సైన్యంలో చేరి, ఆ తర్వాత సమస్యలు ఎదురైనప్పుడు భారత ప్రభుత్వాన్ని ఆశ్రయిస్తున్నారని వివరించింది. ఇది తీవ్ర ఆందోళన కలిగించే ధోరణి అని, ఇలాంటి చర్యలను ప్రభుత్వం ఏమాత్రం ప్రోత్సహించబోదని స్పష్టం చేసింది. తాత్కాలిక ఆర్థిక ప్రయోజనాల కోసం కొందరు భారతీయులు తమ భారత పౌరసత్వాన్ని వదులుకుని, రష్యా పాస్‌పోర్ట్ పొంది మరీ అక్కడి సైన్యంలో చేరుతున్న ఉదంతాలు తమ దృష్టికి వచ్చాయని విదేశాంగ శాఖ ఆందోళన వ్యక్తం చేసింది. ఇటువంటి చర్యల వల్ల తలెత్తే ప్రాణాపాయ పరిస్థితులను పౌరులు గమనించాలని హితవు పలికింది. అనధికారిక ఏజెంట్లు, కొన్ని సంస్థలు సైతం అక్రమంగా రిక్రూట్‌మెంట్లు చేస్తున్నాయని, ఇటువంటి ఉద్యోగ ఆఫర్ల పట్ల అత్యంత అప్రమత్తంగా ఉండాలని పౌరులకు విజ్ఞప్తి చేసింది. రష్యా సైన్యంలో ఉన్న భారతీయుల భద్రతతో పాటు, వారిని త్వరగా స్వదేశానికి రప్పించేందుకు రష్యా ప్రభుత్వంతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలిపింది. ఇప్పటివరకు 139 మంది భారతీయులను సురక్షితంగా వెనక్కి రప్పించామని, మిగిలిన సుమారు రెండు డజన్ల మందిని కూడా రప్పించేందుకు ప్రయత్నాలు కొనసాగుతున్నాయని విదేశాంగ శాఖ వెల్లడించింది.

# నాడు విశాఖకు 'మణిహారం'...
# నేడు ప్రశ్నల సుడిగుండం!

ఇన్వెస్టిగేషన్ టీమ్, పెన్ పవర్ విశాఖపట్నం, సెప్టెంబర్ 30

ఒకప్పుడు చిన్న సముద్ర రేవు... కాలక్రమంలో దేశ వాణిజ్యానికి కీలక ద్వారం...విశాఖ నగర అభివృద్ధితో విడదీయలేని బంధం... వేలాది కుటుంబాలకు ప్రత్యక్షంగా, పరోక్షంగా జీవనాధారం... అదే విశాఖపట్నం పోర్టు. 1933లో ప్రారంభమైన ఈ ఓడరేవు ప్రయాణం తొమ్మిది దశాబ్దాలు దాటింది. నౌకలు వచ్చాయి... సరకు దిగింది... పరిశ్రమలు పెరిగాయి... ఉపాధి విస్తరించింది... విశాఖ నగర ఆర్థిక స్వరూపమే మారిపోయింది. ఇనుప ఖనిజం నుంచి బొగ్గు వరకు... ముడి చమురు నుంచి పెట్రోలియం ఉత్పత్తుల వరకు... ఎరువుల నుంచి ఇతర భారీ సరకు వరకు... సముద్రం నుంచి దేశ పారిశ్రామిక వ్యవస్థకు సరకు చేరే ప్రధాన ద్వారాల్లో విశాఖ పోర్టు తనదైన స్థానం సంపాదించుకుంది. అందుకే విశాఖకు పోర్టు అంటే కేవలం ఓడలు వచ్చిపోయే ప్రదేశం కాదు. అది ఉపాధి... అది వాణిజ్యం...అది పరిశ్రమ... అది నగర ఆర్థిక జీవనాడిలో ఒక భాగం.

**కానీ...**

ఇంతటి చరిత్ర కలిగిన సంస్థలో పరిపాలన, కమర్షియల్ నిర్ణయాలు, ఉద్యోగ వ్యవస్థపై ఇప్పుడు కొన్ని తీవ్రమైన ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ఆ ప్రశ్నలకు సమాధానం వ్యక్తుల మాటల్లో కాదు. రికార్డుల్లో కనిపించాలి. అసలు పోర్టు ఎవరిది?..ముందుగా ఒక విషయం స్పష్టం... విశాఖపట్నం పోర్టు ఏ వ్యక్తికో, ఏ అధికారికో చెందిన ప్రైవేట్ సంస్థ కాదు... ఇది కేంద్ర ప్రభుత్వ వ్యవస్థలోని మేజర్ పోర్ట్ అథారిటీ... మరి అలాంటి సంస్థలో... వ్యవస్థ కంటే వ్యక్తులు బలంగా మారుతున్నారన్న ఆరోపణలు ఎందుకు వినిపిస్తున్నాయి? అధికారిక నిర్ణయాలు నిర్దేశిత విధానంలోనే జరుగుతున్నాయా? లేక కొందరు అధికారుల విచక్షణకు అసాధారణ ప్రాధాన్యం ఏర్పడిందా? ఫైల్‌లో ఉన్న నిబంధనే తుది మాటా? లేక ఫైల్ పట్టుకున్న వ్యక్తే తుది మాటగా మారుతున్నారా?

**ఇదే 'పెన్ పవర్' పరిశీలనలో మొదటి ప్రశ్న.**

రూల్ బుక్ నడుస్తోందా? వ్యక్తుల మాట నడుస్తోందా? ప్రభుత్వ వ్యవస్థలో ప్రతి నిర్ణయానికీ ఒక ప్రక్రియ ఉండాలి. ఎవరు ప్రతిపాదించారు? ఎవరు పరిశీలించారు? ఎవరు సిఫారసు చేశారు? ఎవరు ఆమోదించారు? ఏ నిబంధన కింద ఆమోదించారు? ఆ నిర్ణయానికి సంబంధించిన రికార్డు ఎక్కడుంది? ఇవన్నీ సమాధానం చెప్పగలిగితేనే పరిపాలనపై నమ్మకం నిలుస్తుంది. అందుకే విశాఖ పోర్టులో కమర్షియల్ వ్యవహారాలకు సంబంధించిన నిర్ణయాలను కూడా ఇదే కొలమానంతో చూడాల్సి ఉంది. ఒకే రకమైన వ్యవహారంలో అన్ని కంపెనీలకూ ఒకే విధానం అమలవుతోందా? ఫైళ్ల పరిష్కారంలో అనవసర ఆలస్యాలు ఉన్నాయా? ఉంటే వాటికి రికార్డుల్లో కారణాలు నమోదు చేస్తున్నారా? ఎవరి సిఫారసుతో ఏ నిర్ణయం తీసుకున్నారన్నది స్పష్టంగా కనిపిస్తుందా? ఇవి ఆరోపణలు కావు. పారదర్శక పరిపాలనలో సమాధానం ఉండాల్సిన ప్రశ్నలు.

**కిందిస్థాయి ఉద్యోగుల గొంతు ఎక్కడ?**

పోర్టు అంటే కేవలం చైర్‌పర్సన్ కార్యాలయం కాదు. కేవలం ఉన్నతాధికారుల ఏసీ గదులు కాదు. క్షేత్రస్థాయిలో పనిచేసే ఉద్యోగి నుంచి కార్యాలయంలో ఫైల్ నిర్వహించే సిబ్బంది వరకు --- వేల చేతుల సమిష్టి శ్రమతోనే వ్యవస్థ ముందుకు సాగుతుంది. అయితే... కిందిస్థాయి ఉద్యోగి పైఅధికారి నిర్ణయాన్ని ప్రశ్నించగలడా? నిబంధనలకు విరుద్ధంగా ఉందని భావించిన అంశంపై అభ్యంతరం నమోదు చేయగలడా? లేక ప్రశ్నిస్తే బదిలీ, వేధింపులు లేదా ఇతర ఇబ్బందులు ఎదురవుతాయన్న భయం ఉందా? కొంతమంది ఉద్యోగుల నుంచి వినిపిస్తున్న 'బాసిజం', ఒత్తిళ్ల ఆరోపణల్లో వాస్తవం ఎంత? ఇక్కడ కూడా మాటలు కాదు... ఫిర్యాదులు, విజిలెన్స్ రికార్డులు, పరిపాలనా ఉత్తర్వులు, బదిలీ పత్రాలు, శాఖాపరమైన రికార్డులే నిజాన్ని తేల్చాలి.

**కమర్షియల్ విభాగం... అసలు కథ ఇక్కడే మొదలవుతోందా?**

ఒక భారీ కార్గో నౌక విశాఖ సముద్ర జలాల్లోకి వస్తోంది అనుకుందాం. అది పోర్టుకు రావడానికి ముందే ఒక పరిపాలనా ప్రక్రియ మొదలవుతుంది. నౌక వివరాలు... కార్గో వివరాలు...బెర్త్ లభ్యత...హ్యాండ్లింగ్ ఏర్పాట్లు... షిప్పింగ్ ఏజెంట్ వ్యవహారాలు... కమర్షియల్ అంశాలు... ఇలా అనేక స్థాయిల్లో నిర్ణయాలు ఉంటాయి.

**మరి ఈ నిర్ణయాల గొలుసులో ఎవరి పాత్ర ఎంత?**

అక్కడే అసలు కథ ఉంది. ఒక ఫైలు ఎక్కడ మొదలవుతోంది? ఎన్ని టేబుళ్లు దాటుతోంది? ఎవరు వ్యాఖ్యలు రాస్తున్నారు? ఎవరు సిఫారసు చేస్తున్నారు? చివరకు నిర్ణయం ఎవరు తీసుకుంటున్నారు? అధికారికంగా ఒకరికి ఉన్న అధికారం ఎంత? ఆచరణలో వారి ప్రభావం ఎంత? ఈ రెండింటి మధ్య వ్యత్యాసం ఉందా?

బెర్త్ కేటాయింపు... ఎవరి నిర్ణయం?

పోర్టులో బెర్త్ అంటే వ్యాపారపరంగా అత్యంత కీలకమైన అంశం. నౌక వేచి ఉండే ప్రతి గంటకూ ఆర్థిక విలువ ఉంటుంది. అందువల్ల బెర్త్ కేటాయింపులో పారదర్శకత అత్యంత కీలకం. ఏ నౌకకు ఎప్పుడు బెర్త్ ఇచ్చారు? దానికి ముందు ఎన్ని నౌకలు వేచి ఉన్నాయి? ప్రాధాన్యత నిర్ణయించడానికి ఉపయోగించిన ప్రమాణాలేమిటి?ఏదైనా నౌకకు ప్రాధాన్యత ఇచ్చినట్లయితే దానికి రికార్డుల్లో కారణముందా? ఈ వివరాలను తేదీలు, సమయాలు, నౌకల వారీగా పరిశీలిస్తే చాలా ప్రశ్నలకు సమాధానాలు దొరుకుతాయి.

**కంపెనీ మారితే నిబంధన మారుతుందా?**

ఇది మరో కీలకమైన ప్రశ్న. ఒకే తరహా కార్గో... ఒకే తరహా పరిస్థితులు... వేర్వేరు కంపెనీలు. అప్పుడు నిర్ణయాలు కూడా ఒకే విధంగా ఉంటున్నాయా? లేక ఒక కంపెనీ ఫైలు వేగంగా కదిలి మరో కంపెనీ ఫైలు ఆలస్యమవుతోందా? అలా జరిగితే కారణం ఏమిటి? సాంకేతిక సమస్యా? పత్రాల లోపమా? బెర్త్ అందుబాటులో లేకపోవడమా? లేక మరేదైనా కారణమా? ఫైల్ నోటింగ్స్ ఈ ప్రశ్నకు సమాధానం చెప్పగలవు.

**'ప్రైవేట్ సామ్రాజ్యం' అన్న ఆరోపణ ఎందుకు?**

కేంద్ర ప్రభుత్వ పరిధిలోని ఒక మేజర్ పోర్టును "కొంతమంది అధికారుల ప్రైవేట్ సామ్రాజ్యం"గా అభివర్ణించడం చాలా తీవ్రమైన ఆరోపణ. అందుకే దానిని నినాదంగా వదిలేయడం కాదు... పరీక్షించాలి. ఒక అధికారి తనకు చట్టబద్ధంగా ఉన్న అధికార పరిధిలోనే పనిచేస్తున్నారా? లేక అధికార పరిధిని మించి నిర్ణయాలపై ప్రభావం చూపుతున్నారా? ఒక వ్యక్తి లేకుండా ఫైలు ముందుకు కదలదన్న పరిస్థితి నిజంగా ఉందా? అలా ఉంటే దానికి రికార్డు ఆధారం ఏమిటి? లేక ఇవన్నీ అసంతృప్తితో వస్తున్న ఆరోపణలేనా? రెండు అవకాశాలనూ సమానంగా రికార్డుల ముందు నిలబెట్టాల్సిందే.

**విజిలెన్స్ ఏం చెబుతోంది?**

ఇంతటి ప్రశ్నలు వినిపిస్తున్నప్పుడు మరో కీలక అంశం విజిలెన్స్. కమర్షియల్ వ్యవహారాలపై గతంలో ఫిర్యాదులు వచ్చాయా? ఏ అధికారిపైనైనా లిఖితపూర్వక ఫిర్యాదులు నమోదయ్యాయా? వాటిపై ప్రాథమిక పరిశీలన జరిగిందా? ముగిసిన ఫిర్యాదుల ఫలితం ఏమిటి? పెండింగ్‌లో ఉన్నవి ఎన్ని? ఫిర్యాదులు లేకపోతే --- ఆరోపణలకు మూలం ఏమిటి? ఇవన్నీ తెలుసుకోవాల్సిన అంశాలే.

పెన్ పవర్ ఎవరికీ ముందే తీర్పు ఇవ్వడం లేదు, ఈ కథనంలో అత్యంత ముఖ్యమైన అంశం ఇదే. ఏ అధికారినీ ముందుగానే దోషిగా ప్రకటించడం 'పెన్ పవర్' లక్ష్యం కాదు. అదే సమయంలో ఒక ప్రభుత్వ సంస్థలో పరిపాలన, కమర్షియల్ నిర్ణయాలు, ఉద్యోగులపై ఒత్తిళ్లు లేదా వ్యక్తిగత ప్రభావం గురించి ప్రశ్నలు తలెత్తినప్పుడు వాటిని పట్టించుకోకుండా వదిలేయడం కూడా జర్నలిజం కాదు. ఆరోపణ వస్తే ప్రశ్నిస్తాం. సమాధానం కోరుతాం. రికార్డు వెతుకుతాం. రెండు వైపుల వాదన తీసుకుంటాం. ఆ తర్వాత వాస్తవాన్ని పాఠకుడి ముందుంచుతాం.

**అదే ఈ గ్రౌండ్ రిపోర్ట్ ఉద్దేశం.**

93 ఏళ్ల ప్రతిష్ఠ...ఒక్కరి సొత్తు కాదు! విశాఖ పోర్టు ప్రతిష్ఠ ఏ ఒక్క అధికారి కంటే పెద్దది. ఏ ఒక్క విభాగం కంటే పెద్దది. ఏ ఒక్క షిప్పింగ్ కంపెనీ కంటే పెద్దది. ఎందుకంటే ఇది ప్రజా వ్యవస్థ. దేశ వాణిజ్య ప్రయోజనాలతో ముడిపడిన సంస్థ. అందుకే ఆరోపణలు అవాస్తవమైతే వాటిని రికార్డులతో ఖండించాలి. నిజమైతే బాధ్యులపై చర్య తీసుకోవాలి. కానీ... మౌనం మాత్రం సమాధానం కాదు.

'పెన్ పవర్' అడుగుతున్న ప్రశ్నలు

విశాఖ పోర్టులో వ్యవస్థ బలంగా ఉందా?.. వ్యక్తులు బలంగా ఉన్నారా? రూల్ బుక్ నడుస్తోందా?.. కొందరి మాటే రూల్‌గా మారుతోందా? కమర్షియల్ నిర్ణయాల్లో అందరికీ సమాన అవకాశముందా? బెర్త్ కేటాయింపులో ప్రతి నిర్ణయానికీ రికార్డు ఆధారం ఉందా? కిందిస్థాయి ఉద్యోగులు స్వేచ్ఛగా తమ అభిప్రాయం చెప్పగలుగుతున్నారా? విజిలెన్స్‌కు అందిన ఫిర్యాదులు ఏమయ్యాయి? కమర్షియల్ ఫైళ్లను బయటపెడితే కనిపించేది పారదర్శకతా?.. లేక ఇప్పటివరకు బయటకు రాని మరో కథా? సమాధానాలు ఊహల్లో వద్దు. రికార్డుల్లో కావాలి.

**అందుకే... మొదలైంది 'పెన్ పవర్' గ్రౌండ్ రిపోర్ట్!**

**ఎపిసోడ్--2లో...**

**"కమర్షియల్‌లో ఎవరి మాట నడుస్తోంది?"**

**నౌక రాక నుంచి బెర్త్ కేటాయింపు వరకు...**

**కార్గో హ్యాండ్లింగ్ నుంచి కమర్షియల్ నిర్ణయాల వరకు...**

**ఫైలు ఎవరి టేబుల్‌పైకి వెళ్తుంది?**

**ఎవరు సిఫారసు చేస్తారు?**

**తుది నిర్ణయం ఎవరిది?**

**రికార్డులు ఏం చెబుతున్నాయి?**

**చదువుతూనే ఉండండి పెన్ పవర్ తెలుగు, హిందీ మరియు ఇంగ్లీష్ దిన పత్రికలు**

**ఈ కథనాలపై మీ వద్ద ఆధారాలు/ అభ్యంతరాలు ఉంటే నేరుగా ఈ నెంబర్ లో కాంటాక్ట్ చేయండి : 9059465965 ,** mail id : editorpenpower@gmail.com

## 'బాబాయ్ హత్యతో అబ్బాయికే లాభం'.. జగన్ మౌనంపై మంత్రి నిమ్మల ప్రశ్నలు

- మొదటి పేజి తరువాయి

నిమ్మల రామానాయుడు ప్రశ్నించారు. వివేకా హత్యతో అంతిమంగా లబ్ధి పొందింది జగన్, ఆయన కుటుంబ సభ్యులు, అవినాష్‌రెడ్డి అని సునీల్ యాదవ్ చెప్పినట్లు మంత్రి పేర్కొన్నారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో నిమ్మల మాట్లాడారు. సునీల్ యాదవ్ కోర్టులో తనకు ప్రాణహాని ఉందని చెప్పినా తాడేపల్లి ప్యాలెస్ ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. తనను కాకుండా అంతిమ లబ్ధిదారులైన జగన్, అవినాష్‌రెడ్డి కుటుంబ సభ్యులను విచారిస్తే అసలు విషయాలు బయటకు వస్తాయని సునీల్ చెప్పినట్లు తెలిపారు.

వివేకా హత్య కేసుతో సంబంధం ఉన్న పలువురు కీలక వ్యక్తులు అనుమానాస్పద పరిస్థితుల్లో మృతి చెందడంపైనా మంత్రి ప్రశ్నలు లేవనెత్తారు. కసనూరు శ్రీనివాస్‌రెడ్డి, ఈసీ గంగిరెడ్డి, కువైట్ గంగాధర్‌రెడ్డి, డ్రైవర్ నారాయణ, వైఎస్ అభిషేక్‌రెడ్డి, వాచ్‌మెన్ రంగయ్య తదితరుల మరణాలపై సమాధానాలు రావాల్సి ఉందన్నారు. హత్యకు రూ.40 కోట్ల సుపారీ ఇచ్చినట్లు వచ్చిన అంశాన్ని కూడా నిమ్మల ప్రస్తావించారు. అంత పెద్ద మొత్తాన్ని ఇచ్చే ఆర్థిక సామర్థ్యం ఎర్ర గంగిరెడ్డి, శివశంకర్‌రెడ్డికి లేదని.. రాజకీయంగా లబ్ధి పొందిన జగన్ కుటుంబానికే ఆ సామర్థ్యం ఉందని ఆరోపించారు. సుపారీకి సంబంధించిన నగదులో రూ.40 లక్షలను ఈడీ అటాచ్ చేసిందని చెప్పారు. హత్య జరిగిన రోజు తెల్లవారుజామునే వివేకానందరెడ్డి చనిపోయిన విషయం జగన్‌కు తెలిసినా.. సాయంత్రం వరకు పులివెందుల వెళ్లకుండా హైదరాబాద్‌లో ఎందుకు ఉన్నారని మంత్రి ప్రశ్నించారు. నాటి ముఖ్య సలహాదారు అజయ్ కల్లాం సీబీఐకి ఇచ్చిన వాంగ్మూలాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించారు. ఘటనాస్థలంలో రక్తపు మరకలను తొలగించి, గుండెపోటుగా ప్రచారం చేయడం ద్వారా ఆధారాలను మార్చేందుకు ప్రయత్నించారని నిమ్మల ఆరోపించారు. గతంలో సీబీఐ దర్యాప్తు కోరిన జగన్.. ముఖ్యమంత్రి అయ్యాక విచారణను అడ్డుకునే ప్రయత్నం చేశారని విమర్శించారు. దస్తగిరి, సునీల్ యాదవ్ వాంగ్మూలాలు, దర్యాప్తు సంస్థల నివేదికలు, గూగుల్ టేక్‌అవుట్ ఆధారాలు, ఈడీ అటాచ్‌మెంట్లు కేసులో కీలకంగా ఉన్నాయని మంత్రి అన్నారు. నిందితులు తనపై ఆరోపణలు చేస్తున్నా జగన్ స్పందించకపోవడం ప్రజల్లో అనుమానాలు పెంచుతోందని పేర్కొన్నారు. ఇప్పటికైనా వివేకా హత్యపై జగన్ ప్రజలకు సమాధానం చెప్పాలని నిమ్మల డిమాండ్ చేశారు.

## తిరుపతి నుంచి వారణాసికి 25 బైక్‌లు.. టీడీపీ నేతల సేవా సంకల్ప యాత్ర!

- మొదటి పేజి తరువాయి

ఆయన ప్రారంభించారు. 25 మంది బైక్ రైడర్లు ఈ యాత్రలో పాల్గొంటున్నారు. టీడీపీ జాతీయ అధ్యక్షుడు, సీఎం చంద్రబాబు ఆదేశాలు, మంత్రి నారా లోకేశ్ సూచనల మేరకు టీడీపీ విద్యార్థి విభాగం (టీఎన్ఎస్ఎఫ్) ఆధ్వర్యంలో ఈ యాత్ర నిర్వహిస్తున్నారు. తిరుపతిలోని అలిపిరి నుంచి శ్రీవారి ఆశీస్సులతో ప్రారంభమైన ఈ యాత్ర.. ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఉత్తర్‌ప్రదేశ్ మీదుగా సాగనుంది. సుమారు ఎనిమిది రోజుల పాటు కొనసాగి అక్టోబర్ 8న వారణాసికి చేరుకోనుంది. ఆయా రాష్ట్రాల్లో భాజపా నాయకులు యాత్రకు స్వాగతం పలకనున్నారు. టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు, యువ నేతలు కూడా ఇందులో పాల్గొంటున్నారు. ఈ సందర్భంగా పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ప్రజా జీవితంలో నిబద్ధతతో పనిచేసే నాయకత్వానికి నరేంద్ర మోదీ, చంద్రబాబు నాయుడు నిదర్శనమని అన్నారు. సమాజ నిర్మాణం, ప్రజా సేవ కోసం నిరంతరం

కృషి చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. మోదీ నాయకత్వంలో భారత్ ప్రపంచ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు సాధించిందన్నారు. అదే స్ఫూర్తితో ఆంధ్రప్రదేశ్‌లో అభివృద్ధి, సంక్షేమం, పెట్టుబడుల ఆకర్షణకు కృషి చేస్తున్నామని పల్లా తెలిపారు. ప్రజలకు మెరుగైన పాలన అందించడమే లక్ష్యమని చెప్పారు. మోదీ 25 ఏళ్ల ప్రజా సేవను గుర్తిస్తూ నిర్వహిస్తున్న ఈ యాత్రలో భాగస్వామి కావడం ఆనందంగా ఉందన్నారు. యాత్రలో పాల్గొంటున్న బైక్ రైడర్లకు శుభాకాంక్షలు తెలిపారు.

## మోదీ-ట్రంప్ ఫోన్ కాల్.. వాణిజ్యం, రక్షణ, ఇంధనంపై కీలక చర్చలు

- మొదటి పేజి తరువాయి

చర్చించారు. ఇరు దేశాల ప్రజల ప్రయోజనాల కోసం ద్వైపాక్షిక సహకారాన్ని మరింత బలోపేతం చేయాలని నేతలు పునరుద్ఘాటించినట్లు ప్రధానమంత్రి కార్యాలయం తెలిపింది. అలాగే భవిష్యత్తులోనూ పరస్పరం సంప్రదింపులు కొనసాగించాలని నిర్ణయించినట్లు పేర్కొంది. భారత్–అమెరికా సంబంధాల్లో వాణిజ్యం, రక్షణ, ఇంధనం, కీలక సాంకేతికతల వంటి రంగాలు ముఖ్యమైనవిగా కొనసాగుతున్నాయి. ఇరు దేశాల మధ్య వాణిజ్య సహకారం కొనసాగుతున్నప్పటికీ, ప్రస్తుతం సమగ్ర ద్వైపాక్షిక స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం అమల్లో లేదని విదేశాంగ మంత్రిత్వ శాఖకు చెందిన ఇండియా–యూఎస్ ట్రేడ్ ఫెసిలిటేషన్ పోర్టల్ పేర్కొంటోంది. గతంలోనూ మోదీ, ట్రంప్ పలుమార్లు ఫోన్‌లో మాట్లాడుకున్నారు. ఈ ఏడాది జూన్‌లో జీ7 సదస్సు సందర్భంగా ఇద్దరూ భేటీ అయి భారత్–అమెరికా సంబంధాలపై చర్చించినట్లు విదేశాంగ శాఖకు సంబంధించిన వివరాలను ఉటంకిస్తూ తాజా నివేదికలు తెలిపాయి.

## మహిళలకు ఏసీ బస్సుల్లోనూ ఉచిత ప్రయాణం

- మొదటి పేజి తరువాయి

జిల్లాలో లబ్ధిదారులకు సగటున 130 గజాల స్థలానికి పట్టాలు అందించిన ట్లు చెప్పారు. ఇది పేదల ఆత్మగౌరవానికి కట్టబెట్టిన పట్టాభిషేకమని, వారి చిరకాల వాంఛను నెరవేర్చామని పేర్కొన్నారు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిందని, కేంద్ర ప్రభుత్వ సహకారంతో డబుల్ ఇంజన్ సర్కార్ ఇప్పుడు జెట్ స్పీడ్‌తో అభివృద్ధిని ముందుకు తీసుకెళ్తోందని చంద్రబాబు అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని దశలవారీగా అమలు చేస్తున్నామని, కూటమి ప్రభుత్వం ప్రతీ పేదవాడికి న్యాయం చేసేందుకు అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. ఇప్పటివరకు విశాఖ, మంగళగిరి, విజయవాడ కార్యక్రమాలతో కలిపి సుమారు 60,000 పట్టాలు పంపిణీ చేశామని, వాటి విలువ సుమారు రూ.52,000 కోట్లు ఉంటుందని వివరించారు. లబ్ధిదారులు ఈ ఆస్తిని అమ్ముకోవద్దని, భవిష్యత్ కోసం కాపాడుకోవాలని సూచించారు. మహిళల కోసం 'స్త్రీ శక్తి' పథకం కింద ఉచిత బస్సు ప్రయాణాన్ని అమలు చేస్తున్నామని, భవిష్యత్తులో ఏసీ బస్సులను కూడా కొనుగోలు చేసి వాటిలోనూ ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారు.

## విమానాన్ని కూల్చివేసేందుకు యత్నించాడు

- మొదటి పేజి తరువాయి

అసమాన ధైర్యసాహసాలు, సమయస్ఫూర్తి ప్రదర్శించి.. ఎంతోమంది ప్రాణాలను కాపాడారని, వారికి సెల్యూట్ చేస్తున్నట్లు నెతన్యాహు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దాడికి పాల్పడిన పైలట్‌ను సౌదీ అరేబియా పోలీసులు అరెస్టు చేశారని వెల్లడించారు. దుబాయ్ నుంచి ఇజ్రాయెల్‌కు బయల్దేరిన ఫ్లైదుబాయ్ విమానంలో కెప్టెన్‌పై కో–పైలట్ కత్తితో దాడి చేసిన ఘటన తీవ్ర కలకలం రేపిన విషయం తెలిసిందే.

# శ్రీ వరసిద్ధి వినాయక యువజన సంఘం ఆధ్వర్యంలో అన్నదానం

**భక్తిశ్రద్ధలతో శ్రీ వరసిద్ధి వినాయక నవరాత్రి ఉత్సవాలు**

**తాళ్ళపూడి, పెన్ పవర్, సెప్టెంబర్ 30:**గణపతి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని తాళ్ళపూడి బండారు వారి వీధిలో బుధవారం రాత్రి శ్రీ వరసిద్ధి వినాయక యువజన సంఘం ఆధ్వర్యంలో ఘనంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భక్తులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. గణనాథుడి ఆశీస్సులతో గ్రామంలో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, సకాలంలో వర్షాలు సమృద్ధిగా కురవాలని భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ గణపతి నవరాత్రుల సందర్భంగా ప్రతి సంవత్సరం భక్తుల సహకారంతో వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు



పేర్కొన్నారు.కార్యక్రమంలో శ్రీ వరసిద్ధి వినాయక యువజన సంఘం సభ్యులు, స్థానిక యువత, భక్తులు, బండారు వారి వీధి ప్రజలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

పెన్ పవర్
పోలవరం - ఏలూరు
తూర్పుగోదావరి - పశ్చిమ గోదావరి

# 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలి



* పీవీటీజీ, గుత్తికోయ, ఆర్‌అండ్‌ఆర్ కాలనీల ఓటర్లపై ప్రత్యేక దృష్టి
* చనిపోయిన వారి పేర్ల తొలగింపునకు గ్రామసభల ద్వారా పరిశీలన

**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్, సెప్టెంబరు 30:** పోలవరం జిల్లాలో 18 సంవత్సరాలు నిండిన ప్రతి యువతి, యువకుడిని ఓటరుగా నమోదు చేయాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జన్‌కో డైరెక్టర్, ఎలక్టోరల్ పరిశీలకులు ఎస్. నాగలక్ష్మి అధికారులను ఆదేశించారు. అర్హులైన ప్రతి ఒక్కరి నుంచి దరఖాస్తులు స్వీకరించి, పూర్తిస్థాయిలో పరిశీలించిన అనంతరం ఓటరు జాబితాలో పేరు పొందుపరచాలని సూచించారు.ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమం (ఎస్ఐఆర్)పై బుధవారం రంపచోడవరం ఐటీడీఏ కార్యాలయ సమావేశ మందిరంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల పరిశీలకులు ఎస్. నాగలక్ష్మి, జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి కె. దినేష్ కుమార్, జిల్లా ఎస్పీ కె. చక్రవర్తి, జాయింట్ కలెక్టర్ సురపాటి ప్రశాంత్ కుమార్, చింతూరు ఐటీడీఏ పీఓ శుభం నొక్వాల్, ఓఎస్డీ జావలి, రంపచోడవరం ఆర్డీఓ కె. స్వాతి పాల్గొన్నారు.ఈ సందర్భంగా నాగలక్ష్మి మాట్లాడుతూ పీవీటీజీ కుటుంబాల ఓటరు నమోదు అంశాన్ని ప్రత్యేకంగా పునఃపరిశీలించాలని సూచించారు. ఏజెన్సీ ప్రాంతాల్లో క్లిష్ట పరిస్థితుల్లోనూ బీఎల్ఓలు, ఏఈఆర్ఓలు సమర్థంగా పనిచేస్తున్నారని అభినందించారు. ప్రజల ఫిర్యాదుల పరిష్కారానికి 1950 హెల్ప్‌లైన్‌తో పాటు ప్రత్యేక గ్రీవెన్స్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు.

**ఆర్‌అండ్‌ఆర్ కాలనీలపై ప్రత్యేక దృష్టి**

పోలవరం ప్రాజెక్టు ముంపు ప్రాంతాల నుంచి తరలించిన ఆర్‌అండ్‌ఆర్ కాలనీల్లోని ఓటర్ల సమస్యలను పరిష్కరించాలని రాజకీయ పార్టీల ప్రతినిధులు పరిశీలకుల దృష్టికి తీసుకువచ్చారు. అలాగే గుత్తికోయ ఓటర్ల నమోదును ఒకటికి రెండుసార్లు పరిశీలించి, అవసరమైన చోట గ్రామసభలు నిర్వహించి తీర్మానాల ఆధారంగా అర్హులకు ఓటు హక్కు కల్పించాలని నాగలక్ష్మి సూచించారు.
జిల్లాలోని 12 మండలాల పరిధిలో 399 పోలింగ్ కేంద్రాల్లో ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని రాజకీయ పార్టీల ప్రతినిధులను కోరారు. ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం అర్హులైన ప్రతి ఒక్కరి నుంచి అక్కడికక్కడే దరఖాస్తులు స్వీకరించి, పరిశీలన అనంతరం ఓటరు జాబితాలో చేర్చాలని ఆదేశించారు.

**మృతుల పేర్లపై క్షేత్రస్థాయి పరిశీలన**

ఈ నియోజకవర్గంలో మృతుల పేర్లు ఓటరు జాబితాల్లో కొనసాగుతున్న అంశంపై కూడా నాగలక్ష్మి ప్రత్యేకంగా దృష్టి సారించారు. మృతుల వివరాలను ఒకటికి రెండుసార్లు క్షేత్రస్థాయిలో పరిశీలించి, అవసరమైన చోట పంచనామాలు నిర్వహించాలని సూచించారు. గ్రామసభల ద్వారా నిర్ధారించిన అనంతరం మృతుల పేర్లను ఓటరు జాబితాల నుంచి తొలగించే చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

**రాజకీయ పార్టీలతో సమన్వయంతో చర్యలు**

జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ మాట్లాడుతూ వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎప్పటికప్పుడు సమావేశాలు నిర్వహిస్తూ, వారి దృష్టికి వచ్చిన సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఓటరు జాబితాకు సంబంధించిన మార్పులు, చేర్పులను ఎప్పటికప్పుడు రాజకీయ పార్టీల ప్రతినిధులకు తెలియజేస్తున్నామని పేర్కొన్నారు.సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పి. శ్రీనివాసరావు, స్వప్న కుమారి, బుద్ధ వెంకన్నబాబు, కిరణ్, కె. బాలకృష్ణ, డిప్యూటీ తహసీల్దార్లు సునీత, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

# సుబ్బారావుపేట పార్కు రూ.10.23 లక్షలతో అభివృద్ధి



**ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్**

**రాజమహేంద్రవరం , పెన్ పవర్, సెప్టెంబర్ 30:**నగరంలోని పార్కులను దశలవారీగా అభివృద్ధి చేస్తూ ప్రజలకు ఆహ్లాదకరమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని కల్పిస్తున్నామని సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ తెలిపారు. స్థానిక 1వ డివిజన్ సుబ్బారావు పేటలో రూ.10.23 లక్షలతో అభివృద్ధి చేసిన పార్కును, భవాని చారిటబుల్ ట్రస్ట్ నిధులు రూ.2 లక్షలతో ఏర్పాటు చేసిన షెడ్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్కులో వాకింగ్ ట్రాక్, పిల్లల ఆట స్థలం, ప్లే ఎక్విప్‌మెంట్ ఏర్పాటు చేయడంతో పాటు ఇప్పటికే ఉన్న జిమ్‌ను అభివృద్ధి చేసి, ఫ్లోరింగ్‌ను మెరుగుపరిచినట్లు తెలిపారు. హైమాస్ట్ లైటింగ్, పెయింటింగ్, గ్రిల్స్ తదితర పనులు చేపట్టి పార్కుకు కొత్త రూపాన్ని తీసుకొచ్చామన్నారు. తెలిపారు. భవాని చారిటబుల్ ట్రస్ట్ ద్వారా రూ.2 లక్షల సొంత నిధులతో షెడ్ నిర్మించి అందుబాటులోకి తీసుకొచ్చినట్లు చెప్పారు. ఇదే డివిజన్‌లోని బత్తిన నగర్‌లో పార్కు అభివృద్ధి, దేవాలయానికి షెడ్ ఏర్పాటు వంటి పనులు చేపట్టామని తెలిపారు. ప్రజల అవసరాలను గుర్తించి పార్కులు, రోడ్లు, డ్రైనేజీ తదితర మౌలిక వసతులను ఒక్కొక్కటిగా అభివృద్ధి చేస్తున్నామని ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. ప్రజలు అభివృద్ధి చేసిన పార్కులను సద్వినియోగం చేసుకోవాలని, ముఖ్యంగా మహిళలు ప్రతిరోజూ వాకింగ్, యోగా వంటి కార్యక్రమాల్లో పాల్గొని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. ఆరోగ్యకరమైన రాజమహేంద్రవరం నిర్మాణంలో ప్రజల భాగస్వామ్యం అవసరమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కూటమి నాయకులు, నగర పాలక సంస్థ అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

# బొమ్మూరు జంక్షన్ వద్ద ఫ్లై ఓవర్

## నిర్మించాలన్న ఎమ్మెల్యే గోరంట్ల



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, సెప్టెంబర్ 30**:రాబోయే పుష్కరాల నాటికి ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ప్రణాళికలు చేస్తున్నామని, మోరంపూడి నుండి పొట్టిలంక వరకు సర్వీస్ రోడ్లు ఏర్పాటు చేయాలని రూరల్ శాసనసభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి పేర్కొన్నారు. బుధవారం జాతీయ రహదారుల విభాగం పి.డి కృష్ణ మూర్తి , బృందంతో కలిసి మోరంపూడి నుండి పొట్టిలంక వరకు జాతీయ రహదారిపై ఉన్న పలు ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గోరంట్ల మాట్లాడుతు మోరంపూడి ఫ్లైఓవర్ పై ఉన్న రోడ్డును నాణ్యత ప్రమాణాలను పరిశీలించాలని, రంగులతో ఫ్లై ఓవర్ ను సుందరంగా తీర్చిదిద్దాలని సూచించారు. గాదాలమ్మ నగర్ ఆర్చ్ వద్ద ఫ్లైఓవర్ స్టార్ట్ పాయింట్ వద్ద హైవే, సర్వీస్ రోడ్లను పరిశీలించామన్నారు . త్వరలో మోరంపూడి నామవరం రోడ్ 4 లైన్ల రోడ్డు కాబోతుందని మోరంపూడి జంక్షన్ వద్ద విస్తరణ పనులు చేపట్టాలని, హైవే కి ఆనుకొని ఉన్న నేతాజీ నగర్ చివరి వీధులకు వెళ్లే ఆప్రోచ్ రోడ్డుకు కలుపుతూ సర్వీస్ రోడ్డు నిర్మాణం చేయలని, డ్రైన్లు పొడిగించాలని, మోరంపూడి జంక్షన్ నుండి ఫ్లైఓవర్ చివరి వరకు ఆక్రమణలు తొలగించి, సర్వీస్ రోడ్డు వెడల్పు చేయాలి అని కోరారు.హుకుంపేట జంక్షన్ వద్ద కూడా సర్వీస్ రోడ్డు తో పాటు డ్రైన్ పనులు చేపట్టాలని, ఈస్ట్ రైల్వే రోడ్డుపై వంతెన నిర్మాణం పూర్తయింద న్నారు. 4 లైన్ల రోడ్డు వస్తుందని రోడ్డును అక్కడ డి మార్ట్ వద్ద ఉన్న 100 అడుగుల సర్వీస్ కు కలపాలని, హుకుంపేట జంక్షన్ లో సెంటర్ లైటింగ్ వస్తుందన్నారు. బొమ్మూరు హుకుంపేట మధ్యలో ఉన్న కల్వర్ట్ లను పరిశీలించారు. బొమ్మూరు సెంటర్ లో రోడ్డు ఆక్రమణలు తొలగించాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. రోడ్డు ప్రమాదాలు జరుగుతు న్నాయని, వాటిని నివారించే విధంగా రోడ్డు నిర్మాణం ఉండాలని, పోలీస్ అవుట్ పోస్ట్ త్వరలో రాబోతుందని తెలిపారు.హార్లిక్స్ ఫ్యాక్టరీ వద్ద రోడ్డు విస్తరణ చేయాలని, ఇండస్ట్రీయల కాలనీ వద్ద అండర్ పాస్ నిర్మించాలని, ప్రతిపాదనలు తయారు చేస్తామని పీడీ తెలిపారు. ఇండస్ట్రీయల్ కాలనీకి ఆనుకొని పేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు అయ్యాయని, రౌండ్ కల్వర్ట్ ప్రాంతంలో బాక్స్ కల్వర్ట్ ఏర్పాటు చేయాలని, వేమగిరి జంక్షన్ వద్ద త్వరలో ఫ్లై ఓవర్ నిర్మాణ పనులు మొదలవుతాయని ఫ్లైఓవర్ తో పాటు అండర్ పాస్ కూడా ఏర్పాటు చేయాలని కోరారు. కడియం బుర్రిలంక, పొట్టిలంక గ్రామాలలో కూడా బాక్స్ కల్వర్టు ఏర్పాటు చేయాలని, వేమగిరి కల్వర్టు పూడిక తొలగించాలని, బుర్రిలంక నుండి కడియపులంక వరకు గల నర్సరీ రైతులు గ్రామస్తులు హైవే ప్రక్కన మధ్యలో చెత్త వేస్తున్నారని గమనించి, గ్రామ పెద్దలను శాఖాధికారులను శుభ్రం చేయించాలని, వారిపై చర్యలు తీసుకోమని తెలిపారు.ఈ కార్యక్రమంలో తహసిల్దార్ శ్రీనివాస్, మండల సర్వేయర్లు భువన్, రామకృష్ణ, సిఐలు కాశీ విశ్వనాథ్, వెంకటేశ్వరరావు, మాజీ ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్, రాష్ట్ర రైతు నాయకులు అన్నదేవుల చంటి, మండల తెదేపా అధ్యక్షులు వెలుగుబంటి రఘురాం, ఏఎంసీ వైస్ చైర్మన్ బోడపాటి గోపి, గట్టి సుబ్బారావు, పాఠంశెట్టి రాంజీ, ఆర్.ఐ ప్రసాద్, పంచాయతీరాజ్ ఏఈ ప్రవీణ్ పలు శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అక్టోబర్ 3న వికాస.ఆధ్వర్యంలో రాజమహేంద్రవరంలో మెగా జాబ్ మేళా






**- కలెక్టర్ కీర్తి చేకూరి**

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, స్టాఫ్ రిపోర్టర్, సెప్టెంబర్ 30:**
అక్టోబర్ 3వ తేదీ శనివారం రాజమహేంద్రవరంలోని ఎస్‌కేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి ఒక ప్రకటనలో తెలిపారు. వికాస, ఎస్‌కేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల సంయుక్త సమన్వయంతో ఈ జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. జాబ్ మేళాలో సుమారు 33 ప్రముఖ కంపెనీల ప్రతినిధులు పాల్గొని వివిధ విభాగాల్లో ఉన్న సుమారు 1,600 ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయనున్నట్లు తెలిపారు. అభ్యర్థులకు ముఖాముఖి ఇంటర్వ్యూలు నిర్వహించడంతో పాటు విద్యార్హతలు, ధ్రువపత్రాల పరిశీలన తదితర ప్రక్రియల ద్వారా అర్హులైన అభ్యర్థులను ఎంపిక చేసి నియామక ఉత్తర్వులు అందజేయనున్నట్లు వెల్లడించారు. 10వ తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ, డిప్లొమా, ఐటీఐ, బీటెక్, పీజీ తదితర విద్యార్హతలు కలిగిన నిరుద్యోగ యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అభ్యర్థులు అక్టోబర్ 3న ఉదయం 9 గంటలకు తమ విద్యార్హతలకు సంబంధించిన ధ్రువపత్రాల జిరాక్స్ ప్రతులతో జాబ్ మేళాకు హాజరు కావాలని సూచించారు.

# నిగ్గ తీసి "అడుగు" ఈ కూటమి నేతలని



**సీతానగరం, పెన్ పవర్, సెప్టెంబర్ :30:**గత వైకాపా ప్రభుత్వంలో మంజూరు చేసిన ఏ ఒక్క అభివృద్ధి పని పూర్తి చేయలేని దుస్థితిలో కూటమి ప్రభుత్వం ఉందని వైయస్సార్ సిపి నాయకులు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మండలంలోని సీతానగరం గ్రామంలోని వైయస్సార్సీపీ నాయకుడు పెదపాటి రమేష్ బాబు స్వగృహంలో బుధవారం ఉదయం కూటమి ప్రభుత్వాన్ని అడుగు అనే వినూత్న కార్యక్రమంలో పలువురు వైయస్సార్సీపీ నాయకులు కూటమి ప్రభుత్వ తీరుపై విరుచుకుపడ్డారు. మాజీ ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న
మాట్లాడుతూ అక్టోబర్ 5వ తేదీన రాజానగరం లో భారీ ఎత్తున బహిరంగ సభ జరుగుతుందని రాష్ట్ర యువజన అధ్యక్షులు వైయస్సార్సీపీ మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ఆధ్వర్యంలో భారీ బహిరంగ సభ జరగబోతుందని ఈ సభకు భారీ ఎత్తున మండల ప్రజలు రావాలని పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం వచ్చి మూడేళ్లు గడుస్తున్నా చాలా వైఫల్యం చెందిందని ముఖ్యంగా డిప్యూటీ సీఎం ప్రచార సమయంలో ఎంపీటీసీలకు జడ్పిటిసి లకు గౌరవ వేతనం పెంచుతామని హామీ ఇచ్చారు. కానీ వేతనాలు పెంచకపోగా ఉన్న వేతనాలు 36 నెలలు ఇవ్వకపోవడం జరిగిందని తెలిపారు. సీతానగరం మాజీ సర్పంచ్ కాండ్రపు ముత్యాలు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో చంద్రబాబు నాయుడు ఓట్లు కోసం మభ్యపెడుతూ వాగ్దానాలు కురిపించారన్నారు. పేదలకు వైద్య సదుపాయం అందించాలనే లక్ష్యంతో రఘుదేవపురం లో 30 పడకల ఆసుపత్రి వైయస్సార్సీపి ప్రభుత్వంలో జక్కంపూడి రాజా మంజూరు చేశారని. కనీస ఆసుపత్రి పనులు కూటమి ప్రభుత్వం చేయలేకపోయారని మండిపడ్డారు. బీసీ వర్గాలకు 50 ఏళ్లకే పెన్షన్ పథకం ప్రతి ఆడబిడ్డకు నెలకు 1500 రూపాయలు నిరుద్యోగ భృతి 3000 రూపాయలు మూడు సెంట్లు స్థలంలో పక్కాగా గృహాలు ఉచిత గ్యాస్ సిలిండర్లు వీటిల్లో ఏ ఒక్కటి పూర్తిగా అమలు చేయలేదన్నారు. బొబ్బిలంక వంతెన పనులు రూ. 35 కోట్లు ఖర్చుతో పనులు కూడా చేయలేని పరిస్థితుల్లో ఈ నియోజకవర్గ ప్రజాప్రతినిధులు ఉన్నారని వైఎస్ఆర్సిపి నాయకుడు చల్లమల్ల సుజీరాజు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. రైతాంగం సమస్యలు తీర్చేందుకు పంట భూములను సస్యశ్యామలం చేసేలా సుమారుగా 100 కోట్ల రూపాయలతో నిధులతో తొర్రి గడ్డ రివర్స్ పంపి స్కీం మంజూరు చేస్తే ఆ పనులు కూడా చేయలేకపోయారని వైయస్సార్సీపీ యువజన నాయకుడు పిచ్చికల విజయ్ కుమార్ మండిపడ్డారు. మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా రాజమహేంద్రవరం నుండి సీతానగరం వరకు నాలుగు వరుసల రహదారి విస్తరణ పనుల్లో భాగంగా 16 కిలోమీటర్లు పూర్తి చేశారని మిగతా రెండు కిలోమీటర్లు రహదారి పూర్తి చేయడానికి మూడేళ్లు గడుస్తున్నా చేయలేని పరిస్థితుల్లో స్థానిక ప్రజా ప్రతినిధులు ఉన్నారని వైయస్ఆర్సీపీ కన్వీనర్ కరటూరి హరిబాబు పేర్కొన్నారు.

# స్వచ్ఛత హి సేవ లో భాగంగా ఏరియా ఆసుపత్రిలో పబ్లిక్ హెల్త్ వర్కర్లకు మెడికల్ క్యాంప్



**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. సెప్టెంబర్ 30.** తాడేపల్లిగూడెం పురపాలక సంఘం ఆధ్వర్యంలో స్వచ్ఛత హి సేవ - 2026 కార్యక్రమంలో భాగంగా బుధవారం ఏరియా ఆసుపత్రిలో జరిగిన పారిశుద్ధ్య కార్మికుల కోసం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమని మునిసిపల్ కమిషనర్ ఎమ్. యేసుబాబు ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ క్యాంప్ లో ఏరియా ఆసుపత్రి వైద్యులచే పి హెచ్ వర్కర్లకు ఆరోగ్య పరీక్షలు, బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించచరు. అనంతరం అవసరమైన డాక్టర్ల సూచనలు మేరకు మందులు పంపిణీ చేశారు.

పట్టణ పరిశుభ్రత కోసం నిరంతరం శ్రమించే పారిశుద్ధ్య కార్మికుల ఆరోగ్యం ముఖ్యమని, వారి సంక్షేమం కోసం ఇలాంటి వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం జరిగిందని మున్సిపల్ ఇంజనీర్ వై వెంకటరమణ తెలిపారు. పని సమయంలో భద్రతా చర్యలు, గ్లౌజులు, మాస్కులు తప్పనిసరిగా ధరించాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో ఏరియా ఆసుపత్రి వైద్య సిబ్బంది, మున్సిపల్ అధికారులు, శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

# క్రీడలకు డైమండ్స్ లయన్స్ ప్రోత్సాహం.





**రీజియాన్ చైర్ పర్సన్ లయన్ పేరిచర్ల మురళీ కృష్ణంరాజు.**

**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. సెప్టెంబర్ 30.** క్రీడలకు క్రీడాకారులకు విద్యార్థులకు లయన్స్ ఇంటర్నేషనల్ ప్రోత్సాహం అందిస్తూ క్రీడలను ప్రోత్సహిస్తూ విద్యార్థులను చైతన్య పరచడమే డైమండ్ లయన్స్ లక్ష్యం అని రీజియన్ చైర్ పర్సన్ లయన్ పేరిచర్ల మురళీకృష్ణ రాజు అన్నారు. తాడేపల్లిగూడెం గర్ల్స్ హైస్కూల్లో క్రీడా ప్రాంగణంలో వనిత లయన్స్ చేస్తున్న అభివృద్ధి పనులు పరిశీలిస్తూ నూతనంగా నిర్మాణమైన హై జంప్ కోర్టునుకోర్టును పట్టణ డైమండ్స్ లయన్స్ క్లబ్ ట్రెజరర్ లయన్ కాళ్ల గోపికృష్ణలతో ప్రారంభించారు. గర్ల్స్ హైస్కూల్ అభివృద్ధికి ప్రభుత్వంతో పాటు లయన్స్ క్లబ్ సహకారం స్ఫూర్తిదాయకం అన్నారు. వనిత లయన్స్ క్లబ్ సెక్రటరీ లయన్ కాళ్ల అరుణ కుమారి అభివృద్ధి పనులు ప్రారంభిస్తూ 24 గంటల్లో స్కూల్ కి అందించారు లయన్ కాళ్ళ గోపికృష్ణ మాట్లాడుతూ ఈ స్కూలు ఉపాధ్యాయులు సిబ్బంది ప్రోత్సాహంతో మంచి ఉత్తీర్ణత సాధించాలని స్థానిక శాసనసభ్యులు చీఫ్ విప్ లయన్ బొలిశెట్టి శ్రీనివాసరావు కృషితో మరిన్ని పాఠశాలలో అభివృద్ధి జరుగుతాయని అన్నారు ఈ సందర్భంగా విద్యార్థుల ప్రదర్శన తిలకించారు. ఈ కార్యక్రమం లో చేపల రమేష్ , కొత్తపల్లి విష్ణు ఇంద్ర వాణి ఉపాధ్యాయులు స్కూల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యాన రంగంలో వినూత్న ఆలోచనలకు వేదిక

**హార్టీ ఇన్నోవేటివ్ ఐడియా హ్యాకథాన్‌లో విద్యార్థుల సృజనాత్మకత**



**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. సెప్టెంబర్ 30.** విద్యార్థుల్లో ఆవిష్కరణాత్మక ఆలోచనలు, స్టార్టప్ స్ఫూర్తిని పెంపొందించడంతో పాటు ఉద్యాన రంగ సమస్యలకు సాంకేతిక పరిష్కారాలను ప్రోత్సహించే లక్ష్యంతో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ (ఆర్‌టీఐహెచ్), రాజమహేంద్రవరం ఆధ్వర్యంలో రాష్ట్రీయ ఇన్నోవేషన్ ఛాలెంజ్--1.0లో భాగంగా హార్టీ ఇన్నోవేటివ్ ఐడియా హ్యాకథాన్‌ను నిర్వహించారు. వెంకటరామన్నగూడెంలోని డా. వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయ ఉద్యాన కళాశాల హార్టీ బిజినెస్ ఇంక్యుబేషన్ సెంటర్‌లో ఈ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి విశ్వవిద్యాలయ ఇండస్ట్రియల్ అండ్ ఇంటర్నేషనల్ ప్రోగ్రామ్స్ డైరెక్టర్ డా. పద్మలత ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసేందుకు, వారి ఆలోచనలను ఆచరణాత్మక పరిష్కారాలుగా మలిచేందుకు హ్యాకథాన్‌లు దోహదపడతాయని ఆమె అన్నారు. ఉద్యాన రంగంలో ఎదురవుతున్న సవాళ్లకు సాంకేతికత, నూతన ఆవిష్కరణలతో పరిష్కారాలు చూపాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. కళాశాల అసోసియేట్ డీన్ డా. ఎన్.బి.వి. చలపతి రావు మాట్లాడుతూ.. త్వరగా పాడైపోయే పండ్లు, కూరగాయల్లో పంట అనంతర నష్టాలను తగ్గించేందుకు సమర్థవంతమైన పంట అనంతర నిర్వహణ సాంకేతికతలు, వినూత్న పరిష్కారాల అభివృద్ధి అత్యంత అవసరమని పేర్కొన్నారు. కోత అనంతరం నిల్వ, రవాణా, శీతలీకరణ, విలువ జోడింపు వంటి దశల్లో ఆధునిక సాంకేతికతను వినియోగించడం ద్వారా ఉత్పత్తి నష్టాలను తగ్గించి రైతులకు మెరుగైన ఆదాయం కల్పించవచ్చని తెలిపారు.

కార్యక్రమంలో ఆర్‌టీఐహెచ్ సీఈఓ షేక్ యాసీన్ షరీఫ్, ఆర్‌టీఐహెచ్ ఇంక్యుబేషన్ విభాగం అధిపతి చంద్ర ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు. హ్యాకథాన్‌లో విద్యార్థులు ఉద్యాన రంగానికి సంబంధించిన వివిధ సమస్యలను గుర్తించి, వాటికి పరిష్కార మార్గాలను సూచించే వినూత్న ఆలోచనలు, స్టార్టప్ ప్రతిపాదనలు, సాంకేతిక పరిష్కారాలను నిపుణుల ముందు ప్రదర్శించారు. ఉద్యాన పంటల ఉత్పత్తి, పంట అనంతర నిర్వహణ, విలువ ఆధారిత ఉత్పత్తుల అభివృద్ధి, సాంకేతికత వినియోగం, వనరుల సమర్థ వినియోగం తదితర అంశాలపై విద్యార్థులు తమ ఆలోచనలను వివరించారు. విద్యార్థుల వినూత్న ఆలోచనలను నిపుణులు పరిశీలించి, వాటి సాధ్యాసాధ్యాలపై సూచనలు, మార్గదర్శకత్వం అందించారు. విద్యార్థుల ఆలోచనలను స్టార్టప్‌లు, ఆచరణాత్మక వ్యాపార నమూనాలుగా అభివృద్ధి చేసేందుకు హార్టీ బిజినెస్ ఇంక్యుబేషన్ సెంటర్, ఆర్‌టీఐహెచ్ సహకారం అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమాన్ని అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. శిరీష సమన్వయంతో నిర్వహించారు. ఈ హ్యాకథాన్‌లో కళాశాల బోధనా సిబ్బంది కూడా పాల్గొని విద్యార్థులకు అవసరమైన సూచనలు, మార్గదర్శకత్వం అందించారు.

# భారత ఎన్నికల వ్యవస్థపై అసత్య ఆరోపణలతో అస్థిర పరుస్తున్న ప్రతిపక్షాలు




**రాహుల్ గాంధీ వ్యాఖ్యలపై బీజేపీ ఎమ్మెల్యే నల్లమిల్లి మండిపాటు**

**అనపర్తి ఎమ్మెల్యే, బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి**

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, సెప్టెంబర్ 30:** భారత ఎన్నికల సంఘం, (ఈసీఐ), కేంద్ర ప్రభుత్వంపై కాంగ్రెస్ అగ్రనేత, ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ చేస్తున్న అసత్య ఆరోపణలను బీజేపీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తీవ్రంగా ఖండించారు. రాజ్యాంగబద్ధమైన సంస్థలపై ఆసత్య ఆరోపణలు చేయడం ద్వారా వాటి ప్రతిష్ఠను, దేశాన్ని అస్థిరపరిచే ప్రతిపక్షాలు యత్నాలు చేస్తున్నాయని సరికాదని అన్నారు. స్థానిక బిజెపి కార్యాలయంలో బుధవారం మీడియా సమావేశంలో రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ, ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రతికూల ఫలితాలు వచ్చిన ప్రతిసారీ రాహుల్ గాంధీ వ్యవస్థలపై నిరాదార ఆరోపణలు మోపుతున్నారని విమర్శించారు. హర్యానాలో ఈవీఎంల పైన, మహారాష్ట్రలో ఓట్ల చోరీ , బీహార్‌లో ఓట్లు తొలగించారని ఆరోపణలు చేశారన్నారు. తాజా గా ఒక జాతీయ ఇంగ్లీష్ పత్రికలో వచ్చిన వార్త కథనం ఆధారంగా ఎన్నికల సంఘంలో విభేదాలంటూ రాహుల్ గాంధీ చేస్తున్న వ్యాఖ్యలను నల్లమిల్లి ప్రస్తావించారు. గతంలో సైన్యం, కాగ్, సుప్రీంకోర్టు వంటి రాజ్యాంగబద్ధ సంస్థలపై కూడా రాహుల్ గాంధీ విమర్శలు చేయడాన్ని ఆయన గుర్తుచేశారు. ప్రతిపక్ష నాయకుడిగా వ్యవస్థలపై ఆరోపణలు చేసే ముందు పూర్తి ఆధారాలను ప్రజల ముందుంచాలని సూచించారు. ఓటర్ల జాబితా నుంచి 13 కోట్ల ఓట్లు తొలగించారనే ఆరోపణల్లో వాస్తవం లేదని నల్లమిల్లి పేర్కొన్నారు. 2.8 కోట్లు మృతులు, 3.0 కోట్లు ఆచూకీ లేని వారు, 6.3 కోట్లు శాశ్వతంగా వలస వెళ్లినవారు, 1.0 కోట్లు డూప్లికేట్ ఓట్లు, 3.8 కోట్లు జెన్ జి వారు వంటి కారణాలతో ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ జరుగుతుందని వివరించారు. ఎన్నికల సంఘం అధికారిక వివరాలను పరిగణనలోకి తీసుకోవాలని ఆయన సూచించారు. సోనియా గాంధీ భారత పౌరసత్వానికి చెందిన అంశాన్ని నల్లమిల్లి ప్రస్తావించారు. భారత పౌరసత్వం పొందకముందే 1980 లోనే ఆమె ఓటు హక్కు వినియోగించారనే ఆరోపణలపై రాహుల్ గాంధీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సంఘం నిర్వహిస్తున్న ఎస్ఐఆర్ ప్రక్రియ కొత్తది కాదని, 1952 నుంచి కొనసాగుతోందని, 2026 లో జరిగే ప్రక్రియ 14 వది గా నల్లమిల్లి పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా వివిధ రాజకీయ పార్టీలకు చెందిన లక్షలాది మంది బూత్ లెవెల్ ఏజెంట్లు, బి ఎల్ ఓ లు ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షిస్తున్నారన్నారు.

ఇంత పెద్ద వ్యవస్థలో లోపాలు సహజమని, ఆధారాలతో సరిదిద్దుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

**ఈసీఐ త్రి సభ్య కమిటీని జగన్ ఆమోదించలేదా ?**

ప్రజాస్వామ్య వ్యవస్థలపై ప్రజలకు నమ్మకం కలిగేలా రాజకీయ పార్టీలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని , రాష్ట్రంలో వైసీపీ అధినేత జగన్ ప్రేతాత్మలా మాట్లాడాన్నీ ఎద్దేవ నల్లమిల్లి చేశారు. 2023లో ఈ సి ఐ కి త్రి సభ్య కమిటీ నియామకంలో పార్లమెంట్లో వైసిపి మద్దతు తెలిపిందన్నది గుర్తుంచుకోవాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలకు సర్ కు సంబంధం లేదని దీనిపై అవగాహన లేకుండా వైసీపీ విమర్శలు అర్థరహిత మన్నారు. ఈసీఐ నెట్ నుండి ఈఆర్వో నెట్ గా చట్ట పరమైన డిజిటలైజేషన్ అయింద న్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షులు పిక్కి నాగేంద్ర, రాష్ట్ర కార్యదర్శి బొమ్మల దత్తు, అడబాల రామకృష్ణ, ఎం,రజిని , బేతి రెడ్డి ఆదిత్య , వీర వీరాంజనేయులు, కందికొండ రమేష్ , చిక్కంమోహిని , రవణమ్మ, పెరుమాళ్ళ పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఉంగుటూరు మండల ప్రత్యేకాధికారిగా రామమోహన్ బాధ్యతలు

ఉంగుటూరు మండల ప్రత్యేకాధికారిగా రామమోహన్ బాధ్యతలు



**పెన్ పవర్, ఉంగుటూరు, సెప్టెంబర్ 30:** ఉంగుటూరు మండల ప్రత్యేకాధికారిగా ఏపీ సూక్ష్మ సాగునీటి పథకం ఏలూరు జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ ఎస్. రామమోహన్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. మండల పరిషత్ పాలకవర్గం పదవీకాలం సెప్టెంబర్ 23తో ముగియడంతో ప్రభుత్వం అన్ని మండలాలకు ప్రత్యేకాధికారులను నియమించింది. ఇందులో భాగంగా డాక్టర్ రామమోహన్ ఉంగుటూరు మండల ప్రత్యేకాధికారిగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపీడీవో గంజి రాజ్ మనోజ్, సూపరింటెండెంట్ యు. ఆంజనేయబాబు, డిప్యూటీ ఎంపీడీవో గెడ్డం రమేష్‌బాబు, ముత్తయ్యతో పాటు కార్యాలయ సిబ్బంది ఆయనకు మర్యాదపూర్వకంగా స్వాగతం పలికి సత్కరించారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు, ఉద్యోగులను సమన్వయం చేసుకుంటూ ప్రజలకు మెరుగైన సేవలు అందించడంతో పాటు అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తామని ప్రత్యేకాధికారి రామమోహన్ తెలిపారు.

# పారిశుద్ధ్య కార్మికులకు వైద్య పరీక్షలు





**పెన్ పవర్, ఉంగుటూరు, సెప్టెంబర్ 30:** చేబ్రోలు పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులకు బుధవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. స్వచ్ఛతా సేవా కార్యక్రమంలో భాగంగా పారిశుద్ధ్య సిబ్బందికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, వారి ఆరోగ్య పరిస్థితిని వైద్యులు పరిశీలించారు. అనంతరం పారిశుద్ధ్య కార్మికులను సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో గ్రామ ప్రత్యేకాధికారి, డిప్యూటీ ఎంపీడీవో గెడ్డం రమేష్‌బాబు, తహశీల్దార్ సన్యాసిరావు, పంచాయతీ కార్యదర్శి బీవీ రవిచంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# పల్లె పండుగ--3.0తో గ్రామీణాభివృద్ధి



**జీలుగుమిల్లి, పెన్ పవర్, సెప్టెంబర్30;** రాష్ట్రంలో గ్రామీణ ప్రాంతాల మౌలిక వసతుల అభివృద్ధి లక్ష్యంగా రూ.11,085 కోట్లతో చేపట్టిన పల్లె పండుగ--3.0 కార్యక్రమం గ్రామాల అభివృద్ధికి మరో ముందడుగని జనసేన నాయకులు, మాజీ జడ్పీటీసీ, ద్వారకాతిరుమల శ్రీ చిన్న వెంకన్న దేవస్థానం స్టేట్ ట్రస్ట్ బోర్డు సభ్యుడు గడ్డమణుగు రవికుమార్ బుధవారం జీలుగుమిల్లిలో ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పల్లె పండుగలో భాగంగా 9,500 కిలోమీటర్ల బీటీ రోడ్ల నిర్మాణానికి రూ.7,550 కోట్లు, 6,000 కిలోమీటర్ల సీసీ రోడ్లకు రూ.2,700 కోట్లు కేటాయించారు. అలాగే 22 వేల మినీ గోకులాల నిర్మాణం, 50 వేల ఎకరాల్లో ఉద్యాన పంటల అభివృద్ధి, 1,000 కిలోమీటర్ల మ్యాజిక్ డ్రైన్ల నిర్మాణంతో పాటు బస్‌షెల్టర్లు, గ్రామ పంచాయతీ భవనాలు, రచ్చబండ వంటి మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం నిధులు కేటాయించిందన్నారు.

సెప్టెంబరు 29న నెల్లూరు జిల్లా ఉదయగిరి ప్రాంతంలో పల్లె పండుగ--3.0 కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు రవికుమార్ తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు, పారిశుధ్యం, వ్యవసాయం, పశుసంవర్ధక రంగాలతో పాటు మౌలిక వసతులు మెరుగుపడేందుకు ఈ కార్యక్రమం ఎంతో దోహదపడుతుందని అన్నారు

# కాగుపాడు, గోపాలపురంలో ఎరువుల విక్రయ కేంద్రాలు

కాగుపాడు, గోపాలపురంలో ఎరువుల విక్రయ కేంద్రాలు



**పెన్ పవర్, ఉంగుటూరు, సెప్టెంబర్ 30:** చేబ్రోలు విశాల సహకార పరపతి సంఘం (నారాయణపురం సొసైటీ) ఆధ్వర్యంలో కాగుపాడు, గోపాలపురం గ్రామాల్లో ఎరువులు, పురుగుమందుల విక్రయ కేంద్రాలను కొత్తగా ఏర్పాటు చేసి రైతులకు సత్వర సేవలు అందించనున్నట్లు సొసైటీ చైర్మన్ కడియాల రవిశంకర్ తెలిపారు. బుధవారం నారాయణపురం సొసైటీలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు.

రైతులకు అవసరమైన ఎరువులు, పురుగుమందులు గ్రామాల్లోనే అందుబాటులో ఉండేలా విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు రవిశంకర్ పేర్కొన్నారు. ఈ నిర్ణయంపై ఆయకట్టు రైతులు హర్షం వ్యక్తం చేశారు.

అలాగే సొసైటీ డిపాజిట్ నిధుల నుంచి బంగారు ఆభరణాలపై తక్కువ వడ్డీకే రుణాలు అందించేందుకు సర్వసభ్య సమావేశం ఆమోదం తెలిపింది. వ్యవసాయ యాంత్రీకరణ తదితర రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న రైతుల వివరాలపై ప్రత్యేక దృష్టి సారించి, నిబంధనల మేరకు దరఖాస్తు చేసుకున్న 15 రోజుల్లోనే రుణాలు మంజూరు చేసేలా చర్యలు తీసుకున్నామని చైర్మన్ తెలిపారు. దీనివల్ల రైతులు రుణాల కోసం ఎక్కువ కాలం వేచి ఉండాల్సిన అవసరం లేకుండా సత్వరమే రుణాలు పొందే అవకాశం ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

## సుద్దగుంపులో ఘనంగా అంగన్వాడీ ఉత్సవం



**వి.ఆర్.పురం పెన్.పవర్.సెప్టెంబర్.30:** 2026వ.సంవత్సరంలో జాతీయ పోషణమాసంలో భాగంగా మండలంలోని సుద్దగుంపు,అంగన్వాడీ కేంద్రంలోబుదవారంఅంగన్వాడీ ఉత్సవంసీడీపీఓ వి.మల్లిక,ఆధ్వర్యంలోఘనంగా నిర్వహించడంజరి గింది.ఈకార్యక్రమానికి,బి.జె.పి.జిల్లా కార్యదర్శిబొర్రా కామేశ్వరి,బి.జె.పి.పార్టీనాయకులు,కె.వెంకటరమణ, కె.రాజు,పాల్గొని మాట్లాడారు. 1.పిల్లలు–ఆరోగ్యం 2. పోషణ,3.సమగ్రాభివృద్ధి,4 .కేంద్రంప్రభుత్వంద్వారా పధకాలు,పి.ఎం.ఎం.వి.వై.మిషన్,వాత్సల్య,మిషన్, శక్తి,తదితర,పధకాలుమరియు(అంగన్వాడీలఆధునీ కరణ,)అంగన్వాడీ,లలో కేంద్రప్రభుత్వంఇచ్చే పోషకారంతీసుకొని,గర్భిణీస్త్రీలు,బాలింతలు,ఆరో గ్యంగాఉండాలని,అంగన్వాడీపిల్లలతల్లులుకు,సూ చనలు,ఇస్తూ స్పష్టంచేశారు.అనంతరంగర్భిణీస్త్రీలకు, సీమంతాలుచేశారు.ఈకార్యక్రమంలోసెక్టార్ సూపర్ వైజర్,ఎ.నయోమిరాణి,కిశోరిబాలికలు,గర్భిణీస్త్రీలు, గ్రామపెద్దలు,మడకంపండయ్య,సోడిముత్తయ్య, కబడిశేఖర్,కమిటీసభ్యులుఅంగన్వాడీకార్యకర్తలు, గ్రామస్తులు,తదితరులుపాల్గొన్నారు.

## లక్ష్యాలను నిర్దేశించుకొని.. దేశభివృద్ధిలో భాగస్వాములు కావాలి

- ప్రధాని నరేద్రమోడీ కి మద్దతునివ్వాలి.
- సేవాసంకల్ప చిత్రలేఖనం పోటీల విజేతలకు బహుమతులు.





**తాడేపల్లిగూడెం, పెన్ పవర్. సెప్టెంబర్ 30:** విద్యార్థులు, యువత లక్ష్యాలను నిర్దేశించుకొని వాటిని సాధించేందుకు కృషి చేయాలని, వికసిత్ భారత్ సాధనలో భాగస్వాములు కావాలని బిజెపి నేతలు పిలుపునిచ్చారు. నరేంద్ర మోడీ 25 సంవత్సరాల పరిపాలన సేవ రైతు ఉత్సవాల్లో భాగంగా తాడేపల్లిగూడెం తేతలి సత్యనారాయణ మూర్తి జిల్లా పరిషత్ హై స్కూల్లో బుధవారం మండల స్థాయి విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు బిజెపి రాష్ట్ర కార్యదర్శి భోగి రెడ్డి ఆదిలక్ష్మి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కంచుమర్తి నాగేశ్వరరావు, పట్టణ అధ్యక్షులు దువ్వ శ్రీనివాస్, పట్టణ ప్రధాన కార్యదర్శి చిట్యాల రాంబాబు, మహిళా మోర్చా జిల్లా ఉపాధ్యక్షురాలు సూర్యకుమారి బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి భోగి రెడ్డి ఆధ్వర్యంలో గుజరాత్ ముఖ్యమంత్రిగా 13 సంవత్సరాలు, దేశ ప్రధానిగా 12 సంవత్సరాలు విశేష సేవలు అందిస్తున్న నరేంద్ర మోడీ పరిపాలన రైతు ఉత్సవాల సందర్భంగా దేశవ్యాప్తంగా వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. దీనిలో భాగంగా విద్యార్థులకు నిర్వహించిన చిత్రలేఖన పోటీల్లో ప్రతిభను ప్రదర్శించినందుకు అభినందించారు. రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కంచిమర్తి నాగేశ్వరరావు మాట్లాడుతూ 25 ఏళ్లుగా ప్రధానినరేంద్ర మోడీ నిరాటంకంగా దేశ అభ్యున్నతి కోసం కృషి చేస్తున్నారన్నారు. విద్యార్థులు తమ లక్ష్యాలను సాధించడంతోపాటు దేశం కోసం స్వచ్ఛభారత్ వంటి కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని కోరారు. బిజెపి పట్టణ అధ్యక్షులు దువ్వా శ్రీను మాట్లాడుతూ విద్యార్థులు యువత తమ లక్ష్యాలను నిర్ణయించుకొని వాటికోసం కృషి చేయడంతో పాటు నరేంద్ర మోడీ ఇచ్చిన పిలుపుమేరకు దేశ అభ్యున్నతి కార్యక్రమాల్లో పాల్గొనాలనికోరారు. ఈ కార్యక్రమంలో ఈ పట్టణ ప్రధాన కార్యదర్శి చిట్యాల రాంబాబు, పడాల కావ్య రెడ్డి, మహిళా మోర్చా జిల్లా ఉపాధ్యక్షురాలు సూర్యకుమారి, రాష్ట్ర కౌన్సిల్ మాజీ సభ్యులు అడపా రమేష్ కుమార్, నవీన్ కుమార్ పాల్గొన్నారు. జిల్లా పరిషత్ హై స్కూల్ ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు రవికుమార్, ఉపాధ్యాయులు సి హెచ్ వి రవి తదితరులు పోటీల నిర్వహణ లో పాల్గొన్నారు.

## ఆలిండియా లాయర్స్ యూనియన్ (ఐలు) నూతన అధ్యక్షులుగా ఎన్నికైన" పుట్టా"కు సన్మానం





**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. సెప్టెంబర్ 30.** ఐలు నూతన అధ్యక్షులుగా ఎన్నికైన" పుట్టా"కు సన్మానం

తాడేపల్లిగూడెం ఆలిండియా లాయర్స్ యూనియన్ (ఐలు) నూతన అధ్యక్షులుగా ఎన్నికైన పుట్టా వేణుగోపాల చౌదరి ని తాడేపల్లిగూడెం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘన సన్మానం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బార్ అసోసియేషన్ అధ్యక్షులు కొవ్వూరి అప్పిరెడ్డి అధ్యక్షత వహించారు ఈ కార్యక్రమంలో పలువురు న్యాయవాదులు మాట్లాడుతూ ఐలు నూతన అధ్యక్షులుగా ఎన్నికైన పుట్టా వేణుగోపాల్ చౌదరి ని పలువురు అభినందించి పూలమాలతో ఘన సత్కారం చేశారు. వేణుగోపాల్ చౌదరి సీనియర్ న్యాయవాదని సౌమ్యుడని ఏ కార్యక్రమం తలచిన దిగ్విజయంగా నెరవేరుస్తారని ఆయన ఆధ్వర్యంలో ఐలు కార్యక్రమాలు ముందుకు సాగుతాయని అలాగే పుట్టాకు వచ్చిన గౌరవం తాడేపల్లిగూడెం బార్ అసోసియేషన్ కు వచ్చిన గౌరవం గా భావిస్తున్నామని పలువురు కొనియాడారు. ఐలు కార్యవర్గ సభ్యులుగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు సీనియర్ న్యాయవాది ఎస్. యన్. టి.బాబా డి.ఎన్.యస్.రవి ప్రసాద్ యడవల్లి మణికంఠ తేజ లను పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు కొవ్వూరి అప్పి రెడ్డి , ప్రధాన కార్యదర్శి కంకట శ్రీనివాసరావు, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీ మద్దా శ్రీనుబాబు పూర్వ అధ్యక్షులు ముప్పిడి సురేష్ రెడ్డి సీనియర్ న్యాయవాదులు ముద్ద న శ్రీనివాసరావు, ముళ్ళ పూడి శ్రీనివాసరావు, అరిటాకుల దశరధరామ్, చిట్టా శ్రీనివాస్, బురిటి శ్రీనివాస్ మామిడి ప్రసాద్ మల్లవరపు శివరాం, టీ లోకేష్, మద్దుకూరి వెంకటేశ్వరరావు, కరుటూరి రామకృష్ణ, గజేంద్ర శ్రీనివాస్, ఎం జగదీష్ తదితర న్యాయవాదులు పాల్గొన్నారు.

## కాపుజేపసీజిల్లా కమిటీకు టీ.ఆర్.ప్రసాద్ ఎంపిక



**వి.ఆర్.పురం పెన్.పవర్.సెప్టెంబర్.30.** పోలవరంజిల్లా(కాపు)తూర్పుకాపు,మున్నూరుకాపు , తెలగ,బలిజ,ఒంటరితదితర,కాపుసామాజిక వర్గాల ఐక్యత,హక్కులు,సమస్యలపరిష్కారం కోసంపనిచేస్తు న్నకాపుజేఏసీ,పోలవరంజిల్లాలోనూతనబాధ్యతలు చే పట్టారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాపు జేఏసీ చైర్మన్ అమ్మ శ్రీనివాస్,నాయుడు ఆదేశాల మేరకు టీ.ఆర్. ప్రసాద్‌ను పోలవరం జిల్లా కాపు జేఏసీ జిల్లా కమిటీ ప్రెసిడెంట్‌గా నియమించినట్లు ప్రకటించారు.ఈ సందర్భంగా టీ.ఆర్. ప్రసాద్,మాట్లాడుతూ తనపై నమ్మకంతో జిల్లా స్థాయి బాధ్యతలు అప్పగించిన కాపు జేఏసీ రాష్ట్ర చైర్మన్ అమ్మ శ్రీనివాస్ నాయుడికి కృతజ్ఞతలు తెలిపారు.జిల్లాలోని కాపు సామాజిక వర్గానికి చెందిన ప్రజలనుఐక్యం చేస్తూ, వారి సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసు కెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.కాపు సామాజిక వర్గానికిచెందిన పేదలు, మధ్యతరగతి కుటుంబాలు ఎదుర్కొంటున్న విద్య, ఉపాధి, ఆర్థిక, సామాజిక సమ స్యలపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉంద న్నారు.యువతకు విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పించడంతో పాటు, అర్హులైన వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తానని తెలిపారు.పోలవరం జిల్లా పరిధిలోని కాపు,తూర్పు కాపు.మున్నూరు కాపు.తెలగ, బలిజ, ఒంటరి తదితర వర్గాలను సమన్వయం చేసుకుని జేఏసీని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేయడానికి కృషి చేస్తానని న్నారు.సామాజిక ఐక్యతతో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజాస్వామ్య పద్ధతిలో ఉద్యమాలు నిర్వహిస్తామని తెలిపారు.తనకు అప్పగించిన బాధ్యతను నిబద్ధతతో నిర్వహిస్తూ రాష్ట్ర కాపు జేఏసీ నాయకత్వం సూచనల మేరకు ముందుకు సాగుతానని టీ.ఆర్. ప్రసాద్ పేర్కొన్నారు.నియామకం పట్ల కాపు జేఏసీ నాయకులు, కార్యకర్తలు,పలువురు అభినందనలు తెలిపారు.

## రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ

'మీ భూమి--మీ హక్కు' కార్యక్రమంలో రైతులకు పాస్ పుస్తకాలు అందజేత



**గంగవరం, పెన్ పవర్, సెప్టెంబరు 30:** రైతుల భూమి హక్కులకు భరోసా కల్పించే ఉద్దేశంతో నిర్వహిస్తున్న 'మీ భూమి--మీ హక్కు' కార్యక్రమంలో భాగంగా రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలను పంపిణీ చేశారు. బుధవారం గంగవరం మండలం ఆముదాలబంద పంచాయతీ పరిధిలోని ఆముదాలబంద గ్రామంలో పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అర్హులైన రైతులకు పాస్ పుస్తకాలను అందజేశారు.రైతులకు భూమిపై ఉన్న హక్కులను పటిష్టం చేయడంతో పాటు, భూ సంబంధిత వివరాలను అధికారికంగా నమోదు చేసుకోవడంలో పట్టాదారు పాస్ పుస్తకాలు ఎంతో ప్రాధాన్యత కలిగి ఉంటాయని కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు, అధికారులు తెలిపారు. రైతులు తమ భూములకు సంబంధించిన రికార్డులను భద్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, మాజీ ఎంపీపీ డాక్టర్ తీగల ప్రభ, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కుంజం వెంకటేశ్వర్లు దొర, మాజీ సర్పంచ్ నీలాద్రి లక్ష్మి, బూత్ కన్వీనర్ కుంజం కృష్ణమూర్తి దొర, గ్రామ పెద్దలు మడకం రామన్నదొర, వీఆర్వో అప్పలకొండ, వ్యవసాయ సహాయకుడు కళ్యాణ్ నాయుడు, ఇతర నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## వీబీజీ రామ్ నిధులతో పల్లెలకు మహర్దశ

సీసీ రహదారుల నిర్మాణాలకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే ధర్మరాజు



**పెన్ పవర్, ఉంగుటూరు, సెప్టెంబర్ 30:** గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తూ నిధులు మంజూరు చేస్తోందని ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. బుధవారం ఉంగుటూరు మండలంలో వీబీజీ రామ్ నిధులతో చేపట్టనున్న సీసీ రహదారుల నిర్మాణాలకు ఆయన శంకుస్థాపనలు చేశారు. కాకర్లమూడి పంచాయతీ పరిధిలోని తోట రామచంద్రపురం, బాదంపూడి, నారాయణపురం గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే భూమిపూజ నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యాలు కల్పించడంతో పాటు మౌలిక వసతులను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను సూచించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

## నగర, గ్రామీణ నియోజకవర్గాల ఓటర్ల జాబితాపై సమీక్ష



పరిశీలకులు కె. మాధవీలత

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, సెప్టెంబర్ 30:** రాజమహేంద్రవరం అర్బన్, రూరల్ నియోజకవర్గాల పరిధిలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియలో చేపడుతున్న చర్యలను తూర్పు గోదావరి జిల్లా ఓటర్ల జాబితా పరిశీలకులు, ఏపీ రైతు బజార్ల చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కె. మాధవీలత బుధవారం సమీక్షించారు.స్తానిక నగరపాలక సంస్థ కార్యాలయంలోని పీజీఆర్ఎస్ హాలులో కమిషనర్ రాహుల్ మీనాతో కలిసి ఎన్నికల అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. అర్బన్ నియోజకవర్గ పరిధిలో ఫారం–7, ఫారం–8 దరఖాస్తుల పరిశీలన, తిరస్కరించిన దరఖాస్తులకు నమోదు చేసిన కారణాలు, ఓటర్ల తొలగింపునకు ముందు చేపడుతున్న క్షేత్రస్థాయి ధ్రువీకరణ, డ్రాఫ్ట్ ఓటర్ల జాబితాపై వచ్చిన అభ్యంతరాలు, సవరణలు తదితర అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతి దరఖాస్తును ఎన్నికల నిబంధనల ప్రకారం క్షుణ్ణంగా పరిశీలించాలని, దరఖాస్తు తిరస్కరణకు గల కారణాలను స్పష్టంగా రికార్డుల్లో నమోదు చేయాలని సూచించారు. ముఖ్యంగా కొత్త ఓటరు నమోదుకు సంబంధించిన ఫారం–6 దరఖాస్తుల తిరస్కరణలపై బూత్ స్థాయి అధికారులు శ్రద్ధ వహించి, తిరస్కరణకు ముందు ప్రతి అంశాన్ని మరోసారి క్షుణ్ణంగా పరిశీలించాలని ఆదేశించారు. రూరల్ నియోజకవర్గ పరిధిలోనూ ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై సమీక్ష నిర్వహించారు. ఓటర్ల పేర్లలో వ్యత్యాసాలు, తప్పులు ఉన్న సందర్భాల్లో సంబంధిత వివరాలను, అవసరమైన ధ్రువీకరణ పత్రాలను పరిశీలించి సరిచూడాలని సూచించారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో ప్రతి దశలోనూ అప్రమత్తంగా వ్యవహరించాలని, అర్హులైన వారు ఓటు హక్కును కోల్పోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.

ప్రతి చర్యను నిబంధనలకు అనుగుణంగా అత్యంత జాగ్రత్తగా నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. ఓటర్ల జాబితాలో సవరణలకు తదుపరి దశల్లో అవకాశాలు ఉన్నప్పటికీ, కొత్త ఓటరు నమోదుకు సంబంధించిన ఫారం–6 దరఖాస్తు తిరస్కరణకు గురైతే అర్హులైన వ్యక్తికి ఓటు హక్కు పొందడంలో ఆలస్యం జరిగే అవకాశం ఉన్నందున, దరఖాస్తులను పరిశీలించాలని సూచించారు. నవంబర్‌లో సమ్మరీ రివిజన్ ప్రక్రియ ప్రారంభం కానున్నం దున, అర్హులైన వారు ఆ అవకాశాన్ని వినియోగించు కునేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.ఈ సమీక్ష సమావేశాల్లో కమిషనర్ రాహుల్ మీనా, నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ ఎస్. వెంకటరమణ, సెక్రటరీ శైలజవల్లి, ఎమ్మార్వోలు రంజిత్ కుమార్, శ్రీనివాస్ రావు, డిప్యూటీ సిటీ ప్లానర్ నాయుడు, ఇతర ఏఈఆర్ఓలు, బీఎల్ఓలు, సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

- చట్టాలపై అవగాహనతోనే హక్కులు, బాధ్యతలపై స్పష్టత
- 12న జాతీయ లోక్అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి
- జేఎఫ్‌సీ మేజిస్ట్రేట్ మురళీ గంగాధర్ రావు



**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్, సెప్టెంబరు 30:** విద్యార్థులు చెడు వ్యసనాలకు, మత్తు పదార్థాల వినియోగానికి దూరంగా ఉండి, విద్యపై దృష్టి సారించాలని రంపచోడవరం జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్, మండల న్యాయ సేవాధికార కమిటీ చైర్మన్ ఎం. మురళీ గంగాధర్ రావు సూచించారు. నేటి విద్యార్థులే రేపటి తరానికి ఉన్నతమైన అధికారులుగా ఎదగాల్సి ఉందని, అందుకు విద్యార్థులు ఇప్పటి నుంచే తమ భవిష్యత్తుకు బలమైన పునాది వేసుకోవాలని తెలిపారు. రంపచోడవరంలోని లేనోరా ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం మండల న్యాయ సేవాధికార కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన న్యాయ అవగాహన సదస్సులో మేజిస్ట్రేట్ ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు వివిధ చట్టాలు, హక్కులు, బాధ్యతలపై అవగాహన కల్పించారు.

**పలు చట్టాలు, న్యాయ సేవలపై అవగాహన**

జాతీయ న్యాయ సేవాధికార సంస్థ పథకాలలో భాగంగా అమలవుతున్న వివిధ న్యాయ సేవల గురించి మేజిస్ట్రేట్ వివరించారు. ముఖ్యంగా మానవ అక్రమ రవాణా, వాణిజ్య లైంగిక దోపిడీ బాధితులకు న్యాయ సేవలు, పేదరిక నిర్మూలన పథకాల సమర్థవంతమైన అమలు, గిరిజనుల హక్కులు, మాదకద్రవ్యాల దుర్వినియోగ బాధితులకు న్యాయ సేవలు, సీనియర్ సిటిజన్లకు న్యాయ సేవలు, శిక్షా పథకం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఏజెన్సీ ప్రాంతంలో ఇప్పటికీ కొంతమంది పిల్లలు చదువును మధ్యలోనే నిలిపివేసి పనులకు వెళ్తున్నారని పేర్కొన్న ఆయన, బాలలు బడికి వెళ్లేలా చూడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. బాలల విద్యకు సంబంధించిన చట్టాలు, ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుంటే విద్యా వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని చెప్పారు.

**రాజ్యాంగ హక్కులు తెలుసుకోవాలి**

భారత రాజ్యాంగం, దాని విలువలు, గొప్పతనం, ప్రాథమిక హక్కులు, ప్రాథమిక విధులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 21, 21-ఏ ప్రాముఖ్యత, భావ ప్రకటన స్వేచ్ఛ, విద్యా హక్కు చట్టం, గిరిజన హక్కులు, భూ హక్కుల చట్టాలు తదితర అంశాలను విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో వివరించారు. అలాగే బాలికల హక్కులు, బాల్య వివాహాల నిరోధక చట్టం, బాల కార్మిక చట్టం, పోక్సో చట్టం, మంచి స్పర్శ--చెడు స్పర్శ, మాదకద్రవ్యాల నియంత్రణకు సంబంధించిన చట్టాలు, ఉచిత న్యాయ సహాయం, న్యాయ సేవల ప్రాధాన్యత వంటి అంశాలపై కూడా అవగాహన కల్పించారు.

**మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి**

ప్రస్తుత పరిస్థితుల్లో యువత చట్టాలపై అవగాహన కలిగి ఉండటం ఎంతో అవసరమని మేజిస్ట్రేట్ మురళీ గంగాధర్ రావు తెలిపారు. విద్యార్థులు మత్తు పదార్థాలకు ఆకర్షితులు కాకుండా తమ బంగారు భవిష్యత్తును కాపాడుకోవాలని సూచించారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలను విద్యార్థులు తెలుసుకోవడంతో పాటు, తమ చుట్టుపక్కల ఉన్న వారిని కూడా మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా చైతన్యపరచాలని కోరారు. విద్యార్థులు సమాజం పట్ల, పెద్దల పట్ల గౌరవంగా మెలుగుతూ మంచి విద్యాబుద్ధులు నేర్చుకోవాలని సూచించారు. క్రమశిక్షణ, విద్య, సామాజిక బాధ్యతలతో ముందుకు సాగితే భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని తెలిపారు.

**డిసెంబరు 12న జాతీయ లోక్అదాలత్**

డిసెంబరు 12, 2026న నిర్వహించనున్న జాతీయ లోక్అదాలత్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మేజిస్ట్రేట్ సూచించారు. రాజీ ద్వారా పరిష్కరించుకోదగిన కేసులు ఏమైనా ఉంటే ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు. సమస్యలకు త్వరిత పరిష్కారం పొందేందుకు లోక్అదాలత్ ఒక మంచి వేదికగా ఉపయోగపడుతుందని వివరించారు. ఈ న్యాయ అవగాహన కార్యక్రమంలో ప్యానెల్ న్యాయవాదులు వై. శ్రీనివాసరావు, ఏ.ఆర్.ఆర్. భగవాన్, టీ. వీరబాబు, పోలీసు సిబ్బంది, కోర్టు సూపరింటెండెంట్ నాగభూషణం, కళాశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల్లో వ్యాపార దృక్పథాన్ని పెంచే లక్ష్యంతో ఛాలెంజ్--హ్యాకథాన్ 2.0



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, సెప్టెంబర్ 30:** విద్యార్థుల్లో వ్యాపార దృక్పథాన్ని పెంచే లక్ష్యంతో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ఆర్ట్స్ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో, బుధవారం నగరంలో ఛాలెంజ్--హ్యాకథాన్ 2.0 నిర్వహించారు. పరిమిత పెట్టుబడితో చిన్నతరహా వ్యాపారాలను ప్రారంభించే అవకాశాలను డిగ్రీ విద్యార్థులు గుర్తించి, వాటిని ఆచరణలోకి తీసుకురావచ్చనే అంశాన్ని సమస్యా ప్రకటనగా నిర్వాహకులు అందించారు. విద్యార్థులు సమస్యను విశ్లేషించి, పరిష్కార మార్గాలను రూపొందించ డంతో పాటు వాటిని వ్యాపార ఆలోచనలుగా అభివృద్ధి చేసి న్యాయనిర్ణేతల ముందు ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆర్‌టీఐహెచ్ సీఈఓ ఎస్.కె. యాసీన్ షరీఫ్ మాట్లాడుతూ, విద్యార్థులు ఉద్యోగ అవకాశాల కోసం ఎదురుచూడకుండా తమ నైపుణ్యాలు, ఆలోచనలతో స్వయం ఉపాధి, వ్యాపార అవకాశాలను సృష్టించుకోవాలని సూచించారు. వినూత్న ఆలోచనలను వ్యాపార అవకాశాలుగా మలచేందుకు సంస్థ తరఫున అవసరమైన మార్గదర్శకత్వం, సహకారం అందిస్తామని తెలిపారు.

ఆర్‌టీఐహెచ్ హెడ్ ఇన్క్యుబేషన్ కె. చంద్ర ప్రకాష్ విద్యార్థులకు వ్యాపార ఆలోచనల ఎంపిక, సమస్య పరిష్కారం, మార్కెట్ అవకాశాల గుర్తింపు, ఆలోచనలను ఆచరణాత్మక వ్యాపార నమూనాలుగా అభివృద్ధి చేయడంపై అవగాహన కల్పించారు.

కళాశాల ప్రిన్సిపాల్ డా. రామచంద్ర ఆర్.కె., వైస్ ప్రిన్సిపాల్ వసంత లక్ష్మి, ఐఐహెచ్ కోఆర్డినేటర్ డా. ఎన్. బేబీ నిర్మల, ఆర్‌టీఐహెచ్ ప్రోగ్రామ్ అసోసియేట్స్ జి. అరుణ కుమారి, కె. హారిక తదితరులు పాల్గొన్నారు. హ్యాకథాన్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారిలో ముగ్గురూ థర్డ్ బీఎస్సీ ఆర్గానిక్ ఫార్మింగ్ విద్యార్థులే కావడం విశేషం. పి.ఎం. స్వాతి రామలక్ష్మి మొదటి బహుమతి, టి. హర్షిత రెండో బహుమతి, పి. హేమ రక్షిత మూడో బహుమతి సాధించారు.

# చిరుధాన్యాలతో పిల్లలకు సంపూర్ణ పోషణ

**పిల్లల ఆరోగ్యానికి చిరుధాన్యాలు ఎంతో మేలు**
**తల్లిదండ్రుల భాగస్వామ్యంతోనే పిల్లల సమగ్ర అభివృద్ధి**
**ఐసీడీఎస్ సూపర్వైజర్ కె.కుమారి**



**గంగవరం, పెన్ పవర్, సెప్టెంబరు 30:** చిరుధాన్యాలను పిల్లలకు వివిధ రకాల ఆహార పదార్థాల రూపంలో అందించడం ద్వారా వారి శారీరక, మానసిక అభివృద్ధికి ఎంతో మేలు జరుగుతుందని ఐసీడీఎస్ సూపర్వైజర్ కె. కుమారి తెలిపారు. పిల్లల ఆరోగ్యం, ఎదుగుదల విషయంలో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆమె సూచించారు. గంగవరం మండలం కురుమగుంది అంగన్వాడీ కేంద్రంలో బుధవారం పోషణ్ మహ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కె. కుమారి మాట్లాడుతూ చిరుధాన్యాలను పిల్లలకు లడ్డూలు, బెల్లంతో కలిపిన అట్లు, జావ తదితర రూపాల్లో అందించవచ్చని తెలిపారు. చిరుధాన్యాల్లో ప్రోటీన్లు, పిండి పదార్థాలు వంటి పోషకాలు ఉండటంతో పిల్లల శారీరక ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు ఎత్తు, బరువు వయసుకు అనుగుణంగా పెరుగుతాయని వివరించారు. పోషకాహారం తీసుకోవడం వల్ల రక్తహీనతను నివారించడంతో పాటు పిల్లల్లో చురుకుదనం, మెదడు అభివృద్ధి మెరుగుపడి, ఎదుగుదల దశలో ఆరోగ్యంగా ఉండేందుకు దోహదపడుతుందని తెలిపారు.

**ఆకుకూరలు, పండ్లతో ఆరోగ్య ప్రయోజనాలు**

పిల్లలకు ప్రతిరోజూ ఆకుకూరలు, తాజా పండ్లను ఆహారంలో భాగంగా అందించాలని సూపర్వైజర్ సూచించారు. ముఖ్యంగా బొప్పాయి, జామ, అరటి వంటి పండ్లను తీసుకోవడం వల్ల శరీరానికి అవసరమైన విటమిన్లు లభిస్తాయని తెలిపారు. విటమిన్-ఏ అధికంగా ఉండే ఆహార పదార్థాలను తీసుకోవడం ద్వారా కంటి ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని, రేచీకటి వంటి సమస్యలను నివారించవచ్చని వివరించారు. పిల్లల పోషణ విషయంలో తల్లి, తండ్రితో పాటు కుటుంబ సభ్యులందరూ భాగస్వాములు కావాలని ఆమె కోరారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారాన్ని పిల్లలకు సక్రమంగా అందేలా తల్లిదండ్రులు సహకరించాలని సూచించారు.

**పథకాలపై అవగాహన**

ఈ సందర్భంగా అంగన్వాడీ కేంద్రం ద్వారా అందుతున్న పౌష్టికాహారం, వాటి ప్రయోజనాలు, ఐవీఆర్ఎస్ కాల్స్, ప్రధానమంత్రి మాతృ వందన యోజన తదితర పథకాలపై కూడా తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. పిల్లలు, గర్భిణులు, బాలింతలకు అందుతున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సెక్టార్ సూపర్వైజర్ కె. కుమారి, మాజీ సర్పంచ్ సీహెచ్. మల్లికార్జున రావు, ఆరోగ్య--పోషణ విభాగానికి చెందిన ఎస్. యమున, కె. రాజమ్మ, అంగన్వాడీ సిబ్బంది కె. బుల్లెమ్మ, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# సఫాయి మిత్రలకు ఐడీ కార్డుల పంపిణీ చేసిన కమిషనర్ రాహుల్ మీనా




**రాజమహేంద్రవరం, పెన్ పవర్, సెప్టెంబర్ 30 :** స్వచ్ఛతా హీ సేవా--2026 కార్యక్రమంలో భాగంగా నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో శ్రీ వేంకటేశ్వర ఆనం కళాకేంద్రం నందు బుధవారం 'సఫాయి మిత్ర సురక్షా ఏవం సమ్మాన్ శివిర్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నగరంలోని వ్యర్థాల సేకరణ, రీసైక్లింగ్ కార్యక్రమాల్లో భాగస్వాములైన వేస్ట్ పికర్లకు 'నమస్తే' ఐడీ కార్డులను కమిషనర్ రాహుల్ మీనా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, నగర పరిశుభ్రతను కాపాడటంలో సఫాయి మిత్రలు, వేస్ట్ పికర్లు కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. వ్యర్థాలను సేకరించి, వాటిలో పునర్విని యోగించగల , రీసైక్లింగ్‌కు అనువైన పదార్థాలను వేరు చేయడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు వారు విశేషంగా తోడ్పడుతున్నారన్నారు. సఫాయి మిత్రల భద్రత, సంక్షేమం, గౌరవానికి నగరపాలక సంస్థ ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. 'నమస్తే' కార్యక్రమం ద్వారా వ్యర్థాల సేకరణ రీసైక్లింగ్ రంగంలో పనిచేస్తున్న కార్మికులను గుర్తించి, వారికి అవసరమైన భద్రతా చర్యలు, సంక్షేమ పథకాలు ప్రభుత్వ సేవలను అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. వేస్ట్ పికర్లకు ఐడీ కార్డుల పంపిణీ ద్వారా వారి సేవలను అధికారికంగా గుర్తించడంతో పాటు, సమాజంలో వారికి గౌరవం కల్పించేలా అవగాహన పెంపొందుతుందని కమిషనర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ అధికారులు, సిబ్బంది, సఫాయి మిత్రలు, వేస్ట్ పికర్లు తదితరులు పాల్గొన్నారు.



**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. సెప్టెంబర్ 30:** సెప్టెంబర్ 25 వ తేదీ నుంచి అక్టోబర్ 7వ తేది వరకు గౌరవ ప్రధానమంత్రి 25 సంవత్సరాల ప్రజా సేవ పూర్తిచేసుకున్నందుకు గాను ప్రతిఅంగన్వాడీ కేంద్రంలో సేవ సంకల్ప అభియాన్ లో భాగంగా అంగన్వాడీ ఉత్సవ్ కార్యక్రమం నిర్వహించావలెనని ప్రభుత్వం వారి ఆదేశముల మేరకు ఈ రోజు మహిళా శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ శ్రీయుత ఎమ్.వేణు గోపాల రెడ్డి ఐఏఎస్ అధ్యక్షతన తాడేపల్లిగూడెం మున్సిపాలిటీ, 19 వార్డ్ అంగన్వాడీ కేంద్రంలో ఈ రోజు బుధవారం న నిర్వహించరు. ఈ కార్యక్రమంలో శ్రీయుత డైరెక్టర్ అంగన్వాడీ కేంద్రం నకు హాజరైన తల్లులను ఉద్దేశించి అంగన్వాడీ కేంద్రం ద్వారా అందుతున్న పోషకాహారం యొక్క పరిమాణం మరియు నాణ్యత గురించి అడుగగా తల్లులందరూ సక్రమంగా అందుతున్నాయని సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమం లో మహిళ శిశు సంక్షేమ శాఖ సాధికారిత అధికారి (పిడి ) శ్రీమతి డి..శ్రీలక్ష్మి, సిడిపిఓ శ్రీమతి టిఎల్ సరస్వతి అంగన్వాడీ కేంద్రం లో ఇచ్చే పోషణ మొదలగు 6 సేవలు గురించి తెలియజేసారు అలాగే పిఎంఎంవివై పథకం గురించి, మిషన్ వాత్సల్య పథకం గురించి, ఆధార్ శీల, నవచేతన స్క్రీనింగ్ గురించి తెలియజేసారు. కూటమి నాయకులు హాజరై తల్లులకు పిల్లలకు ఇచ్చే తెర్గురించి, ప్రీ స్కూల్ కి వచ్చే 3 నుండి 6 సంవత్సరాల పిల్లలకు రోజువారీ మన అంగన్వాడీ కేంద్రం లో ఇచ్చే తాజా వేడి భోజనం గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమం లో 4 తల్లులను సన్మానించి అభినందనలు తెలియచేయడమైనది. ఈ కార్యక్రమం లో ఏమసి సభ్యులు, కూటమి నాయకులు సజ్జా సుబ్బు, బోజంకి శ్రీను, మొదలగువారు, ఐసిడిఎస్ సూపర్ యైజెర్. సీఎచ్చ్ దుర్గ భవాని, విసాలాక్షి, ఎమ్ సుజాత, అంగన్వాడీ కార్యకర్తలు బి. త్రివేణి, ఏ. నాగలక్ష్మి మరియు తల్లులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ సోము సమక్షంలో బీజేపీ లో చేరిన మాజీ కార్పొరేటర్ ఏ వి రమణ



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, సెప్టెంబర్ 30:** గత 14 సంవత్సరాలుగా దేశాభివృద్ధికి నిరంతరం పాటుపడుతున్న ప్రధాని మోడీ విధానాలకు, సిద్ధాంతాలకు ప్రపంచవ్యాప్తంగా దేశానికి పేరు ప్రఖ్యాతలు వస్తున్నా యని ఎమ్మెల్సీ సోము వీర్రాజు అన్నారు. మోడీ ఆధ్వర్యంలో దేశంలో బిజెపి బలపడు తుందని, చాలా రాష్ట్రాల్లో అధికారంలో ఉందన్నారు. స్థానిక 21 వ వార్డులో మాజీ కార్పొరేటర్ అయ్యల వెంకట రమణ సోము సమక్షంలో బిజెపి పార్టీలో చేరారు. ఆయనకు బిజెపి కండువా వేసి పార్టీలోకి సాధారంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా సోము మాట్లాడుతూ, మోడీ చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై చాలా మంది ఇటీవల పార్టీలో చేరే వారి సంఖ్య పెరుగుతుందని, పార్టీ బలోపేతానికి కృషి చేయాలి అన్నారు. మాజీ డిప్యూటీ మేయర్, బిజెపి నాయకుడు బొలిశెట్టి సత్యనారాయణ ప్రసాదు మాట్లాడుతూ, ప్రజా సమస్యల పరిష్కారానికి , వార్డు అభివృద్ధికి నిరంతరం పాటుపడిన, పలు సామాజిక సేవల్లో పాలుపంచుకున్న సేవా భిలాషి ఏవి రమణ పార్టీలో చేరడం అభినందనీయమన్నారు. పార్టీ తీర్థం పుచ్చుకున్న ఏవి రమణ మాట్లాడుతూ, పార్టీ సిద్ధాంతాలు, మోడీ అనుసరిస్తున్న ప్రజా సంక్షేమ, అభివృద్ధి నచ్చి బిజెపిలో చేరానన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు బొమ్మల దత్తు, అడబాల రామకృష్ణ, కురగంటి సతీషు, ఎం,రజిని , బేతి రెడ్డి ఆదిత్య , వీర వీరాంజనే యులు, కందికొండ రమేష్ , అలివేలు, చిక్కం మోహిని , రవణమ్మ, పెరుమాళ్ళ పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడీ కేంద్రాలకు ఉచిత కూరగాయల విత్తనాల పంపిణీ




**చింతూరు, పెన్ పవర్, సెప్టెంబర్ 30:** సాపిడ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బుధవారం చింతూరు ఎస్టీ కాలనీ అంగన్వాడీ కేంద్రంలో ఉచిత కూరగాయల విత్తనాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చింతూరు పరిధిలోని 21 అంగన్వాడీ కేంద్రాలకు చెందిన కార్యకర్తలకు 12 రకాల కూరగాయల విత్తనాలను ఉచితంగా పంపిణీ చేశారు. అంగన్వాడీ కేంద్రాల పరిధిలో కూరగాయల సాగును ప్రోత్సహించడం, పోషకాహారంపై అవగాహన కల్పించడం కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్వైజర్ ప్రియాంక, అంగన్వాడీ టీచర్లు, సాపిడ్ సంస్థ ఆర్గనైజర్లు లక్ష్మీ, నాగరాజు, జానకి, అశ్విని, కీర్తి, అంజలి తదితరులు పాల్గొన్నారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District, Andhrapradesh -533003 Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com

## ఓటరు జాబితా సవరణ పారదర్శకంగా చేపట్టాలి

**రాష్ట్ర ఎన్నికల ఓటర్ జాబితా పరిశీలకురాలు ఎస్. నాగలక్ష్మి**





**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్, సెప్టెంబరు 30:** పోలవరం జిల్లాలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా పారదర్శకంగా, ఖచ్చితత్వంతో పూర్తి చేయాలని రాష్ట్ర ఎన్నికల ఓటర్ జాబితా పరిశీలకురాలు ఎస్. నాగలక్ష్మి అధికారులను ఆదేశించారు.బుధవారం రంపచోడవరం ఐటీడీఏ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ కె. దినేష్‌కుమార్, ఎస్పీ కె. చక్రవర్తి, జాయింట్ కలెక్టర్ సురపాటి ప్రశాంత్‌కుమార్, చింతూరు ఐటీడీఏ పీవో శుభం నొక్వాల్, ఓఎస్డీ జావలి, ఆర్డీవో కె. స్వాతి తదితరులతో కలిసి బీఎల్‌ఓలు, ఈఆర్‌ఓలు, ఏఈఆర్‌ఓలతో సమీక్ష నిర్వహించారు.ఫారం-6, 7, 8 ద్వారా వచ్చిన దరఖాస్తులు, అభ్యంతరాలు, పీవీటీజీ ఓటర్ల నమోదు, ఓటర్ల గణాంకాలు, ఈపీఆర్ తదితర అంశాలను సమీక్షించారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలని, మరణించిన వారు, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు తరలివెళ్లిన వారి వివరాలను నిబంధనల ప్రకారం పరిశీలించి జాబితాలో తగిన మార్పులు చేయాలని సూచించారు.రంపచోడవరం నియోజకవర్గంలో 399 పోలింగ్ కేంద్రాల్లో 2,83,996 మంది ఓటర్లు ఉన్నట్లు నాగలక్ష్మి తెలిపారు. మారుమూల గిరిజన ప్రాంతాల్లో పోలింగ్ కేంద్రాలకు ఓటర్లు సులభంగా చేరుకునేలా రహదారి, దూరం, మౌలిక సదుపాయాలను పరిగణనలోకి తీసుకోవాలని ఆదేశించారు.అనంతరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని 203, 205, 207, 208, 209 పోలింగ్ కేంద్రాలను పరిశీలించి, ఓటర్ల సంఖ్య, మౌలిక సదుపాయాలు, ఓటరు జాబితా దస్త్రాలను పరిశీలించారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో ప్రశాంతమైన వాతావరణం కల్పించాలని, ఎన్నికల సంఘం మార్గదర్శకాలను పక్కాగా అమలు చేయాలని సూచించారు.
ఈ కార్యక్రమంలో ఏఈఆర్‌ఓలు, ఈఆర్‌ఓలు, బీఎల్‌ఓలు, రెవెన్యూ, పంచాయతీ, విద్యాశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.౦

## అడ్డతీగలలో ఆపరేషన్ సేఫ్ క్యాంపు.. 'డ్రగ్స్ వద్దు బ్రో' కార్యక్రమం పై అవగాహన కార్యక్రమం...




**అడ్డతీగల, పెన్ పవర్, సెప్టెంబర్ 30:** అడ్డతీగల ఏపీ గిరిజన సంక్షేమ బాలుర జూనియర్ కళాశాలలో బుధవారం ఈగల్, పోలవరం జిల్లా ఆధ్వర్యంలో 'నషా ముక్త్ భారత్ యువ' కార్యక్రమంలో భాగంగా 'బ్రేక్ ద సైలెన్స్'--'డ్రగ్స్ వద్దు బ్రో'పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఐజీపీ ఆర్.కే రవి కృష్ణ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులకు మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఈగల్ బృందం ఆపరేషన్ చైతన్యం, ఆపరేషన్ గరుడ, ఆపరేషన్ సేఫ్ క్యాంపస్ జోన్, జాయింట్ ట్రైన్ ఆపరేషన్స్, ఆపరేషన్ వజ్రప్రహార్ తదితర కార్యక్రమాల గురించి విద్యార్థులకు వివరించారు. ముఖ్యంగా గంజాయి, ఇతర మాదకద్రవ్యాల దుర్వినియోగం వల్ల శారీరక, మానసిక ఆరోగ్యంపై తీవ్ర ప్రభావాలు చూపడంతో పాటు నేరచరిత్రకు దారితీసే ప్రమాదాలపై వివరించారు. విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, తమ చుట్టుపక్కల డ్రగ్స్ లేదా గంజాయికి సంబంధించిన అనుమానాస్పద కదలికలు గుర్తిస్తే వెంటనే సమాచారం అందించాలని ఈగల్ టీం ఎస్సై మావుళ్ళు సూచించారు. గంజాయి సంబంధిత సమాచారాన్ని 1972 టోల్‌ఫ్రీ నంబర్‌కు తెలియజేయవచ్చుని, సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని ఈగల్ బృందం తెలిపింది. ఈ అవగాహన కార్యక్రమంలో కళాశాలకు చెందిన సుమారు 110 మంది విద్యార్థులు చే ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ హరి ప్రసాద్, స్పెషల్ బ్రాంచ్ కానిస్టేబుల్ బుజ్జి బాబు పాల్గొన్నారు.

## బొడ్డగండి పంచాయతీలో దోమతెరల పంపిణీ



**గంగవరం/రంపచోడవరం, పెన్ పవర్, సెప్టెంబర్ 30:**గుర్తేడు మండలం బొడ్డగండి పంచాయతీ పరిధిలోని మెట్టగూడెం గ్రామంలో దోమతెరల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డొంకరాయి జనసేన నాయకులు పీలా శ్రీను హాజరయ్యారు. ఈ సందర్భంగా పీలా శ్రీను మాట్లాడుతూ వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని కూటమి ప్రభుత్వం అందజేసిన దోమతెరలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రతి ఇంట్లో పడక గదుల్లో దోమతెరలను ఏర్పాటు చేసుకుని మలేరియా, ఇతర దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల నుంచి రక్షణ పొందాలని, గ్రామాన్ని మలేరియా రహిత గ్రామంగా తీర్చిదిద్దేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మంగంపాడు పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ ఎం. ఈక్షిత్, సచివాలయం ఏఎన్‌ఎం జె. అప్పలరాం, గ్రామస్థులు కిల్లో నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఎకరాలో ఏదో ఒక పంట సాగు చేయాలి

### ఖరీఫ్--2026 పరిస్థితులపై అధికారులతో కలెక్టర్ దినేష్‌కుమార్ సమీక్ష

### రిజర్వాయర్ల ద్వారా సాధ్యమైనంత మేర సాగునీరు అందించాలి

### తాగునీటి సమస్య రాకుండా చర్యలు

### జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్




**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్, సెప్టెంబరు 30:**పోలవరం జిల్లాలో రైతుల భూముల్లో ఒక్క ఎకరం కూడా ఖాళీగా ఉండకుండా వివిధ రకాల వ్యవసాయ, ఉద్యాన పంటలు సాగు చేసేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కె. దినేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. రైతులు వ్యవసాయం ద్వారా ఆర్థికంగా అభివృద్ధి చెందేలా అవసరమైన ప్రోత్సాహం, విత్తనాలు, సాగునీటి సౌకర్యాలు కల్పించేందుకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.బుధవారం రంపచోడవరం స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులతో ఖరీఫ్--2026 సీజన్ పరిస్థితుల నిర్ధారణపై జిల్లా కలెక్టర్ కె. దినేష్‌కుమార్, జిల్లా జాయింట్ కలెక్టర్ సురపాటి ప్రశాంత్‌కుమార్, చింతూరు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి శుభం నొక్వాల్, చింతూరు సబ్ కలెక్టర్ నరేంద్ర పడాల్ సమీక్ష సమావేశం నిర్వహించారు.

**పంటల పరిస్థితిపై క్షేత్రస్థాయి పరిశీలన**

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 2026 జూన్ 1 నుంచి ఆగస్టు 31 వరకు నమోదైన వర్షపాతం, పంటల సాగు పరిస్థితి, పంట నష్టం తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలించాలని తెలిపారు. అధికారులు క్షేత్రస్థాయిలో సేకరించిన వివరాల ఆధారంగా ఖరీఫ్--2026 పరిస్థితులపై తదుపరి చర్యలు చేపట్టనున్నట్లు వెల్లడించారు.

**రిజర్వాయర్ల నీటిని వినియోగించుకోవాలి**

భూపతిపాలెం, ముసురుమిల్లి, వట్టిగడ్డ, సూరంపాలెం, మద్దిగడ్డ రిజర్వాయర్ల ద్వారా ప్రస్తుతం ఎన్ని ఎకరాలకు సాగునీరు అందుతోందో కలెక్టర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. గత ఏడాది ఎన్ని ఎకరాల్లో వరి, ప్రకృతి వ్యవసాయం సాగు చేశారనే వివరాలను కూడా ఆరా తీశారు.
జిల్లాలోని రిజర్వాయర్ల ద్వారా సాధ్యమైనంత మేరకు సాగునీరు అందించి రైతులు పంటలు సాగు చేసేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. భూములను ఖాళీగా వదిలిపెట్టకుండా అనువైన పంటలను సాగు చేసేలా రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు.

**ఉద్యాన పంటలపై ఆరా**

ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో జిల్లాలో మిర్చి, పూలు, జాఫ్రా, జీడిమామిడి తదితర పంటలు ఎన్ని ఎకరాల్లో సాగు చేస్తున్నారనే వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ప్రత్యేక మైనర్ ఇరిగేషన్ ద్వారా ఎన్ని ఎకరాలకు సాగునీరు అందిస్తున్నారో, జిల్లాలో ఎన్ని చెరువులు, చెక్‌డ్యామ్‌లు ఉన్నాయో కూడా సమీక్షించారు.

**తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు**

జిల్లాలో ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అవసరమైన ప్రాంతాలను గుర్తించి తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు.

**'సూర్యఘర్' పథకంపై సమీక్ష**

ప్రధానమంత్రి సూర్యఘర్ పథకం ద్వారా జిల్లాలోని 12 మండలాల్లో ఇప్పటివరకు ఎన్ని గృహాలు సౌర విద్యుత్ వ్యవస్థల కోసం నమోదు చేసుకున్నాయి, ఎన్ని ఇళ్లకు సౌర విద్యుత్ వ్యవస్థలు ఏర్పాటు చేశారనే వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో సౌర విద్యుత్ వ్యవస్థల ఏర్పాటుకు తీసుకుంటున్న చర్యలపై కూడా అధికారులతో చర్చించారు.

**పశుగ్రాసం ఏర్పాటుకు చర్యలు**

జిల్లాలో పశువులకు మేత కొరత రాకుండా ప్రతి మండలంలో నాలుగు ఎకరాల్లో పశుగ్రాసం సాగు చేసేలా చర్యలు చేపట్టనున్నట్లు కలెక్టర్ తెలిపారు. అవసరమైన చోట మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా పనులు చేపట్టాలని సూచించారు.రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందేలా అపరాల విత్తనాలను సబ్సిడీపై అందించేందుకు చర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు.సమావేశంలో పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ షేక్ అహ్మద్ షరీఫ్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రామమోహన్‌రావు, డోమా ప్రాజెక్టు డైరెక్టర్ రాంప్రసాద్, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి దేవదానం, డివిజనల్ పంచాయతీ అధికారి ఎర్రంశెట్టి రాజు, పీహెచ్‌ఓ నరేంద్రకుమార్, సీపీఓ వెంకట్రావు, డీఈలు పి. వెంకటరమణ, శివ, రమేష్ తదితర అధికారులు పాల్గొన్నారు.

## శ్రీ లక్ష్మీ గణపతి మోటార్ యూనియన్ ఆధ్వర్యంలో అన్నసమారాధన..

**అడ్డతీగల, పెన్ పవర్, సెప్టెంబర్ 30:** బుధవారం వినాయక చవితి ముగింపు సందర్భంగా గణేష్ నిమజ్జనానంతరం, శ్రీ లక్ష్మీ గణపతి మోటార్ యూనియన్ ఆధ్వర్యంలో అన్న సమాధానం నిర్వహించారు. ఈ అన్న సమారాధన కార్యక్రమంలో సుమారు 3000 మంది పాల్గొని స్వామివారి అన్న ప్రసాదాన్ని స్వీకరించినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా భారీ అన్నదానాన్ని నిర్వహించారు.



## అంగన్వాడీ కేంద్రాల్లో సేవలను అభినందించిన బీజేపీ నాయకులు






**చింతూరు, పెన్ పవర్, సెప్టెంబర్ 30:** చింతూరు మండలంలోని ఎస్టీ కాలనీలోని అంగన్వాడీ కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో సేవా సంకల్ప అభియాన్ కార్యక్రమాన్ని బూత్ నంబర్ 349 పరిధిలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ ఎస్టీ మోర్చా మాజీ రాష్ట్ర కార్యదర్శి బట్ట సుప్రజ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. టీడీపీ మైనార్టీ సెల్ నాయకులు ఎస్కే జాఫర్, బీజేపీ చింతూరు మండల అధ్యక్షుడు బట్ట లక్ష్మయ్య రాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బట్ట లక్ష్మయ్య రాజు మాట్లాడుతూ గర్భిణులకు పౌష్టికాహారం అందించడం, బాలింతలకు అవసరమైన సేవలు అందించడం, చిన్నారులు ఆరోగ్యంగా ఎదిగేలా అంగన్వాడీ సిబ్బంది అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. నిస్వార్థంగా సేవలందిస్తున్న వారిని గుర్తించి గౌరవించడమే సేవా సంకల్ప అభియాన్ ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని నెలరోజుల పాటు ఆయన స్ఫూర్తితో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మిషన్ శక్తి, అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందుతున్న సేవలను నాయకులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్వైజర్ ప్రియాంక, అంగన్వాడీ సిబ్బంది, బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో ఉపాధి హామీ పథకంలో సేవలందిస్తున్న ఫిల్డ్ అసిస్టెంట్ ల సమస్యలు పరిష్కరించాలి



**అంబాజీపేట, పెన్ పవర్, సెప్టెంబరు30:**20 ఏళ్లుగా ఉపాధి హామీ పథకం ఫిల్డ్ అసిస్టెంటులుగా సేవలందిస్తున్న వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ గ్రామీణ ప్రాంతాల్లో గత 20 సంవత్సరాలుగా ఉపాధి హామీ పథకంలో సంబంధిత సేవలు అందిస్తున్న వారి సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కార్మికులు కోరుతున్నారు. స్థానిక ఎం.పి.డి.వో కు డిమాండ్ లతో కూడిన వినతి ప్రతం ఉపాధి హామీలో పనిచేస్తున్న సిబ్బంది బుధవారం అందచేసారు. ఎటువంటి సర్వీస్ కండిషన్స్ లేకుండా సంవత్సరాల తరబడి పనిచేస్తున్న తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం అనుబంధ పనుల్లో పనిచేస్తున్న సిబ్బందికి సరైన వేతనాలు, ఇతర సౌకర్యాలు అందడం లేదని తెలిపారు. 2019లో ఎఫ్.టిఈ విధానం అమలులోకి వచ్చినప్పటికీ తమ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించలేదని పేర్కొన్నారు. కనీస వేతనం, ఈఎస్ ఐ తదితర సౌకర్యాలు కల్పించాలని కోరారు.తమ సమస్యల పరిష్కారం కోసం అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోవాలని కార్మికులు విజ్ఞప్తి చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో నిరంతరం సేవలందిస్తున్న తమను గుర్తించి తగిన న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల పరిధిలో పనిచేస్తున్న ఉపాధి హామీ పథకం పీల్డ్ అసిస్టెంట్ లు పాల్గొన్నారు.

## నియోజకవర్గం ఫైర్ బ్రాండ్ చల్లా రాజ్యలక్ష్మి కి మరో పదవి.



**జగ్గంపేట నియోజకవర్గ కాపు పొలిటికల్ జేఏసీ మహిళా చైర్మన్‌గా చల్లా రాజ్యలక్ష్మి**

**గోకవరం పెన్ పవర్ సెప్టెంబర్ 30:-** డేర్ అండ్ డైనమిక్ లీడర్, మహిళ ఫైర్ బ్రాండ్ సమాజంలో జరుగుతున్న అన్యాయాలు అసమానతలను ఎదురించే గుండె ధైర్యం కలిగి ప్రశ్నించడానికి రాజకీయాలకు వచ్చానంటూ నిలబడిన గొంతుక చల్లా రాజ్యలక్ష్మిని జగ్గంపేట నియోజకవర్గం కాపు పొలిటికల్ జేఏసీ మహిళా కన్వీనర్ గా నియమించారు. గతంలో జనసేన పార్టీ తరపున గోకవరం మండల మహిళాఅధ్యక్షురాలిగా పనిచేసి స్థానిక రాజకీయ సమీకరణాల నేపథ్యంలో తెలుగుదేశం పార్టీలోకి వెళ్లి శాసనసభ్యులు జ్యోతుల నెహ్రూ విజయానికి తన వంతు సహాయ సహకారాలు అందించి తన పార్టీలో సరైన గుర్తింపు గౌరవం దక్కకపోవడంతో ఇటీవల కాలంలో తెలుగుదేశం పార్టీకి రాజీనామా చేసి పార్టీలకతీతంగా తన గొంతు వినిపించాలి ప్రజా సమస్యలు పరిష్కరించాలని ధ్యేయంతో పనిచేస్తున్న రాజ్యలక్ష్మి కి మరో అరుదైన గౌరవం దక్కింది.కాపు సంఘం తరపున ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా మహిళా అధ్యక్షురాలిగాకూడాబాధ్యతలు నిర్వహించిన ఆమెను తాజాగా జగ్గంపేట అసెంబ్లీ నియోజకవర్గ కాపు పొలిటికల్ జేఏసీ మహిళా చైర్మన్‌గా నియమించారు.ఈ మేరకు కాపు పొలిటికల్ జేఏసీ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల చైర్మన్ శ్రీనివాసరావు ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. కాపు మహిళల సమస్యల పరిష్కారం కోసం చల్లారాజ్యలక్ష్మి చేస్తున్న సేవలను గుర్తించి ఈ బాధ్యతలు అప్పగించినట్లు పేర్కొన్నారు.

# ఈసీ వివాదంలో టీడీపీ స్టాండ్ ఇదే.. మంత్రి లోకేశ్ కీలక వ్యాఖ్యలు!

**హైదరాబాద్ పెన్ పవర్:** జాతీయ రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారిన ఎన్నికల కమిషన్ వివాదంపై టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి లోకేశ్ తొలిసారి స్పందించారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ కేంద్ర ప్రభుత్వానికి అనుకూలంగా పనిచేస్తున్నారని విపక్షాలు తీవ్ర విమర్శలు చేస్తున్నాయి. కాంగ్రెస్ పార్టీ ఈ విషయంపై జాతీయ స్థాయిలో ఆందోళనలు చేయగా, ఎన్డీఏ మిత్రపక్షాలు కూడా ప్రభుత్వాన్ని ఇబ్బంది పెట్టేలా వ్యాఖ్యలు చేశాయని అంటున్నారు. ఈ విషయంలో ఈసీ నిజాయితీని నిరూపించుకోవాలని టీడీపీ నేత శ్రీకృష్ణదేవరాయలు చేసిన వ్యాఖ్యలు హాట్ టాపిక్ అయ్యాయి. ఈ నేపథ్యంలో ఒక జాతీయ మీడియా చానల్ నిర్వహించిన కాంక్లేవ్ లో పాల్గొన్న మంత్రి లోకేశ్ ఈ వివాదంపై ఎదురైన ప్రశ్నకు ఆసక్తికరంగా సమాధానమిచ్చారని అంటున్నారు.ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ ఏకపక్ష ధోరణితో వ్యవహరిస్తున్నారని, కమిషన్‌లోని ఇతర సభ్యుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవడం లేదని విపక్షాలు విమర్శలు చేస్తున్న విషయం తెలిసిందే. ప్రజాస్వామ్య వ్యవస్థలో అత్యున్నతంగా ఉండాల్సిన స్వయంప్రతిపత్త సంస్థలోనూ పారదర్శకత కొరవడిందంటూ జాతీయ స్థాయిలో ప్రతిపక్ష పార్టీలు పెద్దఎత్తున దుమారం రేపుతున్నాయి. ఈ తరుణంలో ఎన్డీయే కూటమిలోని టీడీపీ, ఎల్జేపీ వంటి మిత్రపక్షాలు ఈ వివాదాన్ని ఎలా చూస్తున్నాయనే దానిపై దేశవ్యాప్తంగా ఆసక్తి నెలకొంది.



**విమర్శలను తోసిపుచ్చిన లోకేశ్**

ఈ వివాదంపై జాతీయ మీడియా వేదికగా స్పందించిన నారా లోకేశ్.. ప్రతిపక్షాల వాదనలను గట్టిగా తిప్పకొట్టారు. ఎన్నికల్లో ఓటమి పాలైన ప్రతిసారీ నిందలను ఈసీపై, వ్యవస్థలపై నెట్టడం ప్రతిపక్షాలకు ఒక అలవాటుగా మారిందని ఆయన విమర్శించారు. ఈవీఎంల ట్యాంపరింగ్ లేదా ఈసీ పక్షపాత వైఖరిపై వస్తున్న ఆరోపణలను ప్రస్తావిస్తూ... ఒకవేళ ఈవీఎంలు అధికార పక్షానికి అనుకూలంగా పనిచేస్తే, కేరళ, తెలంగాణ వంటి రాష్ట్రాలలో కాంగ్రెస్ పార్టీ ఎలా గెలిచింది? అని లోకేశ్ సూటిగా ప్రశ్నించారు. దీనివల్ల ఈసీ తీరుపై ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణల్లో హేతుబద్ధత లేదని ఆయన స్పష్టం చేశారు.

**నిబంధనలపై స్పష్టత, వ్యవస్థలపై గౌరవం**

గతంలో టీడీపీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కూడా ఎన్నికల ప్రక్రియ మరియు 'ఎస్ఐఆర్' (ూ×=) విధానంపై కొన్ని సందేహాలు తలెత్తిన విషయాన్ని లోకేశ్ గుర్తుచేశారు. అయితే, ఆ సందర్భంలో తాము కేవలం ఆరోపణలు చేయకుండా, నేరుగా ఎన్నికల కమిషన్‌ను సంప్రదించి తమ సందేహాలను నివృత్తి చేసుకున్నామని తెలిపారు. ఒక రాజకీయ పార్టీగా వ్యవస్థలను అకారణంగా విమర్శించడం కంటే, అనుమానాలు ఉన్నప్పుడు అధికారులను కలిసి వాస్తవాలు తెలుసుకోవడం బాధ్యత అని ఆయన అభిప్రాయపడ్డారు. అంతేకాకుండా క్షేత్రస్థాయిలో ఓటర్ల జాబితాల సవరణ వంటి అంశాలపై పట్టుదలగా పనిచేయడమే అసలైన రాజకీయ పద్ధతి అని టీడీపీ నిరూపించిందని ఆయన పరోక్షంగా పేర్కొన్నారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ నిర్ణయాలు, కమిషన్‌లోని అంతర్గత భిన్నాభిప్రాయాలపై జాతీయ రాజకీయాలు వేడెక్కిన వేళ ఎన్డీయే కూటమి తరఫున నారా లోకేశ్ వ్యక్తం చేసిన అభిప్రాయాలు అత్యంత ప్రాధాన్యం సంతరించుకున్నాయని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. ప్రతిపక్షాలు చేస్తున్న రాజకీయ విమర్శలను తిప్పకొడుతూ, ఎన్నికల సంఘంపై నమ్మకం ఉంచాలని ఇతర మిత్రపక్షాలకు లోకేశ్ ఇచ్చిన స్పష్టమైన సందేశం ఇచ్చారని అంటున్నారు. అంతేకాకుండా లోకేశ్ వ్యాఖ్యలు జాతీయ స్థాయిలో ఎన్డీయే మిత్రపక్షాల దృఢమైన వైఖరికి అద్దం పడుతున్నాయని అంటున్నారు.

# ఏబీవీ దెబ్బకు దిగి వచ్చిన ప్రభుత్వం.. రిటైర్డ్ ఐపీఎస్ తొలి విజయం

**హైదరాబాద్ పెన్ పవర్:** రిటైర్డ్ ఐపీఎస్ ఏబీ వెంకటేశ్వరరావు (ఏబీవీ) విమర్శలతో ప్రభుత్వం దిగి వచ్చింది. తప్పు ఎత్తి చూపితే సవరించుకుంటామని సంకేతాలిచ్చిందని అంటున్నారు. ప్రభుత్వ ప్రకటనలు, ఇతర కార్యక్రమాలలో ప్రోటోకాల్ పాటించడం లేదని ఇటీవల ఏబీవీ చేసిన విమర్శలు తీవ్ర చర్చనీయాంశం అయ్యాయి. అయితే ఈ విషయమై నేరుగా స్పందించని ప్రభుత్వం తాజాగా చేపట్టిన కార్యక్రమంలో ఆ పొరపాటు జరగకుండా జాగ్రత్తలు తీసుకుంది. దీంతో ఏబీవీ విమర్శలు పనిచేశాయని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు.

పేదలకు పట్టాభిషేకం పేరుతో విశాఖ, విజయవాడ తదితర ప్రధాన పట్టణాల్లో ప్రభుత్వ భూముల్లో ఇళ్లు నిర్మించుకున్న వారికి శాశ్వత హక్కులు కల్పించే కార్యక్రమం ప్రభుత్వం చేపట్టింది. ముందుగా విశాఖలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది. ఆ సమయంలో పత్రికలకు జారీ చేసిన ప్రకటనలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ తోపాటు మంత్రి లోకేశ్ ఫొటోలను వేశారు. దీనిపై సోషల్ మీడియా వేదికగా ఏబీవీ ప్రశ్నలు సంధించారు. ప్రోటోకాల్ పాటించాల్సిన ప్రభుత్వం మంత్రులను కూడా పక్కన పెడుతున్నట్లు సంకేతాలిస్తోందని విమర్శలు గుప్పించారు. అంతేకాకుండా ప్రభుత్వ అధినేతగా ముఖ్యమంత్రి ఫొటో వేయవచ్చుని, కానీ పవన్, లోకేశ్ ఫొటోలు ఏ విధంగా వేస్తారని నిలదీశారు. ప్రభుత్వాన్ని మీ ముగ్గురే నడిపేయొచ్చు కదా, మిగతా మంత్రులు ఎందుకు అంటూ ప్రశ్నలు సంధించారు.దీంతో ప్రభుత్వం ఆలోచనలో



పడినట్లుగా చెబుతున్నారు. ఈ విషయంలో ఏబీవీ లేవనెత్తిన అభ్యంతరం సహేతుకమైనదని భావించిందని అంటున్నారు. ఫలితంగా విజయవాడలో బుధవారం నిర్వహించిన కార్యక్రమానికి సంబంధించి పత్రికలకు జారీ చేసిన ప్రకటనల్లో తొలిసారిగా రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ ఫొటో వేశారని చెబుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గత రెండేళ్లలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్, మంత్రి లోకేశ్ ఫొటోలతో మాత్రమే ప్రకటనలు ఇస్తున్నారని అంటున్నారు. కానీ ఏబీవీ విమర్శలతో ఇప్పుడు సంబంధిత మంత్రుల ఫొటో కూడా ప్రకటనల్లో ముద్రించాలని నిర్ణయించుకున్నట్లు చెబుతున్నారు. దీంతో ఏబీవీ ప్రభుత్వంపై విజయం సాధించారని పరిశీలకులు చమత్కరిస్తున్నారు.

ఇక రాజకీయాలపై ఆసక్తితో కొత్త పార్టీని ప్రారంభిస్తానని గతంలో ప్రకటించిన రిటైర్డ్ పోలీసు అధికారి ఏబీవీ గత కొంతకాలంగా రాష్ట్రంలోని పలు సామాజిక సమస్యలపై పోరాడుతున్నారు. ప్రధానంగా 22ఏ భూ సమస్యలతోపాటు ప్రభుత్వ కాంట్రాక్టులు, ప్రజాధనం దుర్వినియోగం అయ్యే అవకాశం ఉన్న పలు ప్రాజెక్టులపై నిపుణులతో కలిసి గళం విప్పుతున్నారు. సోషల్ మీడియా వేదికగా తన అభిప్రాయాలను వ్యక్తం చేస్తూ ప్రభుత్వంపై పోరాడుతున్నారని అంటున్నారు. దీంతో ప్రభుత్వం కూడా ఏబీవీ చేసే విమర్శలపై ఓ కన్నేసినట్లు చెబుతున్నారు. నిజానికి ముఖ్యమంత్రి చంద్రబాబుకు అత్యంత సన్నిహితుడిగా గతంలో వ్యవహరించిన ఏబీవీ.. ఇప్పుడు ఎదురుతిరగటమే కాకుండా ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టేలా చేస్తున్న విమర్శలు తీవ్ర చర్చనీయాంశం అవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆయన చేస్తున్న విమర్శల్లో సహేతుకమైన అంశాలు ఉంటే ప్రభుత్వం సరిదిద్దుకోవడం ద్వారా ఆయనతో సామరస్యంగా ఉండేందుకు ప్రాధాన్యమిస్తోందని అంటున్నారు.

# SR01 లోకల్ బాడీ ఎన్నికలు యధాతథం

**విజయవాడ, సెప్టెంబర్ 30 పెన్ పవర్:**
స్థానిక ఎన్నికలపై ఎన్నికల సంఘం ఒక క్లారిటీ ఇచ్చింది. ఎన్నికలు ఇంకో రెండు నెలలు ఆలస్యం అవుతాయనే వార్తలను ఖండించింది. పుకార్లను నమ్మొద్దని ప్రజలను కోరింది. స్థానిక ఎన్నికలకు సంబంధించి ఏ సమాచారమైన మీడియా సమావేశం ద్వారా వెల్లడిస్తామని పేర్కొంది. సోషల్ మీడియాలో వస్తున్న సమాచారాన్ని నమ్మే ముందు.. సంబంధిత అధికారిక వెబ్‌సైట్‌లో ఉన్న వివరాలతో ధ్రువీకరించుకోవాలని సూచించింది. అలాగే స్థానిక ఎన్నికలపై పుకార్లు సృష్టించినా, ఫార్వార్డ్ చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది.ఏపీ స్థానిక ఎన్నికలపై ఎన్నికల సంఘం కీలక ప్రకటన చేసింది. స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ మరో రెండు నెలలు ఆలస్యం అవుతుందనే వార్తలను ఖండించింది. ఈ పుకార్లలో ఎలాంటి వాస్తవం లేదని రాష్ట్ర ఎన్నికల సంఘం ఒక అధికారిక ప్రకటనలో స్పష్టం చేసింది. ఎన్నికల ఆలస్యంపై సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాన్ని కొట్టిపారేసింది. ఇందులో ఏ మాత్రం నిజం లేదని తేల్చి చెప్పింది. ఈ ఫేక్ వార్తలను ఎట్టి పరిస్థితుల్లోనూ నమ్మొద్దని తెలిపింది. ఓటర్ల జాబితాలు, రిజర్వేషన్ల కోర్టు కేసులపై క్లారిటీ వచ్చాకే ప్రక్రియ ప్రారంభమవుతుందనే ప్రచారంలో నిజం లేదని ఏపీ ఎస్ఈసీ వెల్లడించింది. స్థానిక ఎన్నికలపై కొందరు ఉద్దేశపూర్వకంగా తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేస్తున్నారని, ఇలాంటి కల్పిత సమాచారాన్ని ఇతరులకు పంపించ వద్దని ఎన్నికల సంఘం కోరింది.ఏపీ స్థానిక ఎన్నికల సమాచారాన్ని మీడియా సమావేశాల ద్వారా వెల్లడిస్తామని ఎన్నికల సంఘం స్పష్టంగా చెప్పింది. ఎన్నికల కమిషన్ పేరుతో కల్పిత, తప్పుదారి పట్టించే లేదా అనధికారిక సమాచారాన్ని పుట్టించినా, ఫార్వార్డ్ చేసినా చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని కూడా హెచ్చరించింది. సోషల్ మీడియా, వాట్సాప్‌ల ద్వారా వచ్చే మెసెజ్‌లను నమ్మే ముందు ఎస్ఈసీ అధికారిక వెబ్‌సైట్, అధికారిక ప్రకటనల ద్వారా సమాచారాన్ని ధ్రువీకరించుకోవాలని సూచించింది.ఏపీలో మండల ప్రజా పరిషత్‌లు, జిల్లా ప్రజా పరిషత్‌ల ఐదేళ్ల పదవీకాలం ముగిసిన నేపథ్యంలో ఎన్నికల నిర్వహణపై ఆసక్తి నెలకొంది. ఇప్పటికే రాష్ట్రంలో 123 పట్టణ స్థానిక సంస్థలకు మున్సిపల్ ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించినట్టు తెలుస్తుంది. అయితే ఎన్నికల తేదీ, పూర్తి షెడ్యూల్ ఇంకా అధికారికంగా వెలువడ లేదు. కానీ ఇప్పటికే పట్టణాలు, పల్లెల్లో ఈ ఎన్నికల హడావిడి కనిపిస్తుంది. రాజకీయ పార్టీలు కూడా స్థానిక ఎన్నికల కోసం సన్నాహాలు చేసుకుంటున్నాయి. కాగా గత 2021 మున్సిపల్ ఎన్నికల్లో పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీ గెలుపొందింది. కార్పొరేషన్ వార్డుల లెక్కలోనూ ఆ పార్టీ ఆధిపత్యం సాధించింది. మరి 2026 స్థానిక ఎన్నికల్లో ఎవరిదీ పై చేయిగా ఉండబోతుందనే అంశం ఆసక్తికరంగా మారింది.

## పల్లె పండుగ 3.0

**నెల్లూరు, సెప్టెంబర్ 30 పెన్ పవర్: :** వైసీపీ ఐదేళ్ల హయాంలో పంచాయతీరాజ్ వ్యవస్థ పూర్తిగా నిర్వీర్యమై, కనీస రహదారుల నిర్వహణ లేక రాష్ట్రంలోని పల్లెలు తీవ్ర అంధకారంలోకి వెళ్లిన సమయంలో పవన్ కల్యాణ్ డిప్యూటీ సీఎం అయ్యారు. నిధుల కేటాయింపులు, పారదర్శక పాలన , స్వర్ణ పంచాయతీ పోర్టల్ వంటి విప్లవాత్మక సంస్కరణలతో ఆగిపోయిన నిధులను పంచాయతీలకు మళ్లించి వ్యవస్థకు కొత్త ఊపిరి పోశారు. ఆయన పట్టుదలతో శాఖలో పనులు వేగవంతమై, గతంలో ఎన్నడూ లేని విధంగా 13,218 పంచాయతీల్లో ఒకే రోజు గ్రామసభలు నిర్వహించి ప్రపంచ రికార్డు సృష్టించడం పవన్ కళ్యాణ్ నాయకత్వ పటిమకు నిదర్శనంగా నిలిచింది.పవన్ కళ్యాణ్ నేతృత్వంలో పంచాయతీరాజ్ శాఖ చేపట్టిన అపూర్వమైన చర్యలతో రాష్ట్రవ్యాప్తంగా గుంతలమయమైన రహదారులకు మహర్దశ పడుతోంది. ఉపాధి హామీ నిధులను సమర్థవంతంగా వినియోగిస్తూ, గత పల్లె పండుగ 1.0, 2.0 విడతల్లో వేలాది కిలోమీటర్ల సీసీ, బీటీ రోడ్లను, మినీ గోకులాలు , ఇతర మౌలిక వసతులను రికార్డు సమయంలో పూర్తి చేసి పవన్ కళ్యాణ్ తమ శాఖ సామర్థ్యాన్ని నిరూపించారు. గ్రామీణ ప్రాంత ప్రజల రవాణా కష్టాలను తీర్చడమే ధ్యేయంగా, ప్రాధాన్యత క్రమంలో అన్ని ప్రధాన రహదారులను సురక్షితంగా మార్చేందుకు ఆయన ప్రణాళికాబద్ధంగా అడుగులు వేశారు.ఈ దిశగా పంచాయతీరాజ్ శాఖను మరింత పరుగులు పెట్టిస్తూ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో కలిసి నెల్లూరు జిల్లా ఉదయగిరి నియోజకవర్గంలో ప్రతిష్టాత్మక పల్లె పండుగ 3.0 కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. రూ. 11,085 కోట్ల భారీ నిధులతో గ్రామీణ రూపురేఖలను మార్చేలా డిజైన్ చేసిన ఈ ప్రాజెక్టు ద్వారా రాష్ట్రంలో మౌలిక సదుపాయాల విప్లవానికి తెరలేపారు. గ్రామీణ పేదరికం నిర్మూలనతో పాటు మౌలిక వసతుల కల్పనలో పంచాయతీరాజ్ శాఖ శరవేగంగా నిర్ణయాలు తీసుకోవడం పవన్ విజన్‌కు అద్దం పడుతోంది.ఈ పల్లె పండుగ 3.0 ద్వారా పవన్ కళ్యాణ్ నేతృత్వంలోని పంచాయతీరాజ్ శాఖ ఏకంగా 15,500 కిలోమీటర్ల మేర రవాణా సౌకర్యాలను విస్తరించనుంది. ఇందులో రూ. 7,550 కోట్లతో 9,500 కిలోమీటర్ల బీటీ రోడ్ల పనులు, రూ. 2,700 కోట్లతో 6,000 కిలోమీటర్ల సీసీ రోడ్ల నిర్మాణ పనులను వేగవంతం చేస్తున్నారు. వీటితో పాటు పాడి రైతుల కోసం రూ. 300 కోట్లతో 22,000 మినీ గోకులాలు, రూ. 225 కోట్లతో ఉద్యాన పంటల పెంపకం, రూ. 110 కోట్లతో మ్యాజిక్ డ్రెయిన్లు , రూ. 200 కోట్లతో పంచాయతీ భవనాలు, బస్ షెల్టర్ల నిర్మాణాన్ని చేపడుతున్నారు. పవన్ కళ్యాణ్ ప్రత్యేక శ్రద్ధ, నిరంతర పర్యవేక్షణతో పంచాయతీరాజ్ శాఖ నేడు దేశంలోనే నంబర్ వన్ స్థానానికి దిశగా అడుగులు వేస్తోంది.

## ఓవర్‌డ్రాఫ్ట్ సంక్షోభం నుంచి స్వయం సమృద్ధి దిశగా ఏపీ !

**విజయవాడ,సెప్టెంబర్ 30 పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థ గత రెండేళ్లలో విప్లవాత్మకమైన మార్పును సాధించింది. నిత్యం ఓవర్‌డ్రాఫ్ట్‌పై ఆధారపడే దయనీయ పరిస్థితి నుంచి సొంత కాళ్లపై నిలబడే స్వయం సమృద్ధి స్థాయికి రాష్ట్ర ఆర్థిక శాఖ చేరుకుంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అమలు చేస్తున్న కఠినమైన ఆర్థిక క్రమశిక్షణ, నిధుల వినియోగంలో పాటిస్తున్న విచక్షణ రాష్ట్ర ఆర్థిక మూలాలను పటిష్టం చేశాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ప్రతి నెలా ఖజానా నిర్వహణకు, ఉద్యోగుల జీతభత్యాల కోసం ఓవర్‌డ్రాఫ్ట్ తీసుకోవడం సర్వసాధారణంగా మారగా.. ప్రస్తుతం ఆ పరిస్థితి పూర్తిగా మారిపోయిందనడానికి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అధికారిక నివేదికలే అద్దం పడుతున్నాయి.ఆర్బీఐ విడుదల చేసిన ఫైనాన్షియల్ అకామడేషన్ అవైల్డ్ బై స్టేట్ గవర్నమెంట్స్ గణాంకాల ప్రకారం.. 2026 ప్రారంభ నెలల్లో ఏపీ ఆర్థిక క్రమశిక్షణ ఎంత వేగంగా పుంజుకుందో స్పష్టంగా తెలుస్తోంది. 2026 ఏప్రిల్ నెలలో రాష్ట్రం ఓవర్‌డ్రాఫ్ట్ సదుపాయాన్ని కేవలం ఒక్క రోజు మాత్రమే వినియోగించుకోగా , ఆ తర్వాతి నెల అయిన మే-2026 నాటికి ఓవర్‌డ్రాఫ్ట్ రోజుల సంఖ్య జీరోకు పడిపోయింది. అంటే మే నెలలో రాష్ట్ర ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా ఓడీ తీసుకోకుండా తన అవసరాలను స్వయంగా తీర్చుకోగలిగింది. దేశంలో పలు ఇతర రాష్ట్రాలు ఇప్పటికీ భారీగా ఓడీ, వేస్ అండ్ మీన్స్ అడ్వాన్సులపై ఆధారపడుతుండగా.. ఆంధ్రప్రదేశ్ మాత్రం నెల రోజుల్లోనే ఓడీ రహిత రాష్ట్రంగా నిలవడం విశేషం.కేవలం ఓవర్‌డ్రాఫ్ట్ మాత్రమే కాకుండా, తాత్కాలిక నగదు కొరతను అధిగమించేందుకు తీసుకునే వేస్ అండ్ మీన్స్ అడ్వాన్సెస్ వినియోగం కూడా గణనీయంగా తగ్గిపోయింది. 2026 ఏప్రిల్ నెలలో 8 రోజుల పాటు సగటున రూ.1,996 కోట్ల చొప్పున డబ్ల్యూఎంఏ తీసుకోగా.. మే నెల నాటికి అది సగానికి సగం తగ్గి కేవలం 4 రోజులకు, సగటున రూ.466.25 కోట్లకు పరిమితమైంది. అలాగే ప్రభుత్వం తన వద్ద ఉన్న సెక్యూరిటీలను హామీగా ఉంచి తీసుకునే స్పెషల్ డ్రాయింగ్ ఫెసిలిటీ కూడా ఏప్రిల్‌లో 25 రోజుల పాటు సగటున రూ. ?7,181 కోట్లు ఉండగా, మే నాటికి 21 రోజులకు, సగటు మొత్తం రూ.6,225.92 కోట్లకు తగ్గింది. ఆర్బీఐ సదుపాయాలపై ప్రభుత్వం క్రమంగా ఆధారాన్ని తగ్గించుకుంటూ వస్తోందనడానికి ఈ సంఖ్యలే నిదర్శనం.గత ప్రభుత్వ హయాంలో విచ్చలవిడిగా చేసిన అప్పులు, అడ్డగోలు నిధుల మళ్లింపులతో రాష్ట్ర ఖజానా దివాళా అంచున నిలిచిన సంగతి తెలిసిందే. అయితే ప్రస్తుత ప్రభుత్వం ఆదాయ వనరులను సమర్థవంతంగా సమీకరించుకుంటూ, అనవసర ఖర్చులకు కళ్లెం వేస్తూ ఆర్థిక నిర్వహణను పకడ్బందీగా చేపట్టింది. సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తూనే, అభివృద్ధి పనులకు నిధులు కేటాయిస్తూ ఖజానాను స్వయం సమృద్ధి దిశగా నడిపించడంలో ఆర్థిక శాఖ విజయం సాధించింది. ఓవర్‌డ్రాఫ్ట్ అనే పదం వినపడకుండా సొంత రాబడులతో రాష్ట్ర రథాన్ని ముందుకు తీసుకెళ్తున్న ప్రస్తుత ఆర్థిక నిర్వహణే ఆంధ్రప్రదేశ్ భవిష్యత్ ప్రగతికి అసలైన వెన్నెముకగా నిలుస్తోంది.

## విశాఖలో మల్లారెడ్డి వర్సిటీ

**విశాఖపట్టణం, సెప్టెంబర్ 30 పెన్ పవర్:** తెలంగాణలో బలమైన ఇంజనీరింగ్, మెడికల్ , ప్రైవేట్ విశ్వవిద్యాలయ వ్యవస్థను నిర్మించిన బిఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి చామకూర మల్లా రెడ్డి.. ఇప్పుడు తన దృష్టిని ఆంధ్రప్రదేశ్ వైపు సారిస్తున్నారు. తెలంగాణలో మల్లా రెడ్డి యూనివర్సిటీ'తో పాటు డీమ్డ్ విశ్వవిద్యాలయ హోదాతో విద్యా రంగాన్ని ఏలిన మల్లా రెడ్డి గ్రూప్, ఆంధ్రప్రదేశ్‌లో తన విద్యా వ్యాపారాన్ని అత్యంత వేగంగా విస్తరిస్తోంది. ఏపీలోని ప్రధాన నగరాలు, ఉమ్మడి జిల్లాలను లక్ష్యంగా చేసుకుని రీజినల్ క్యాంపస్‌లు, శాటిలైట్ క్యాంపస్‌లు , ఆఫ్-క్యాంపస్ సెంటర్ల ఏర్పాటుకు మల్లా రెడ్డి విద్యా సంస్థల యాజమాన్యం ప్రణాళికలను వేగవంతం చేసింది.ఈ విస్తరణ ప్రణాళికలో భాగంగా ఏపీ ఐటీ, ఆర్థిక రాజధాని విశాఖపట్నంలో మల్లా రెడ్డి డీమ్డ్ యూనివర్సిటీ ఆఫ్-క్యాంపస్ పేరుతో భారీ ఆఫ్-క్యాంపస్ సెంటర్‌ను ఇప్పటికే ప్రారంభించారు. యూజీసీ అనుమతులతో ఏర్పాటు చేసిన ఈ క్యాంపస్‌లో ఇంజనీరింగ్, మేనేజ్‌మెంట్, హెల్త్‌కేర్ విభాగాల్లో అత్యాధునిక కోర్సులను ఆఫర్ చేస్తున్నారు. విశాఖతో పాటు రాజధాని అమరావతి పరిధిలోని విజయవాడ, గుంటూరు బెల్ట్‌తో పాటు రాయలసీమ కేంద్రమైన తిరుపతి, కర్నూలు జిల్లాల్లోనూ కొత్త క్యాంపస్‌ల నిర్మాణానికి భూముల సేకరణ, అనుమతుల ప్రక్రియను వేగంగా పూర్తి చేస్తున్నట్లు సమాచారం. తిరుపతిలో ఓ కాలేజీని కొని ఇప్పటికే ఆఫ్ క్యాంపస్ ను ప్రారంభించారు.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రైవేట్ విశ్వవిద్యాలయాలు, ఉన్నత విద్యాసంస్థల స్థాపనకు ఇస్తున్న ప్రోత్సాహకాలు మల్లా రెడ్డి గ్రూప్‌కు కలిసివస్తున్నాయి. తెలంగాణకు చెందిన వేలాది మంది ఏపీ విద్యార్థులు ప్రతిఏటా మల్లా రెడ్డి విద్యాసంస్థల్లో చేరుతున్నందున నేరుగా ఏపీలోని స్థానిక ప్రాంతాల్లోనే నాణ్యమైన మౌలిక వసతులతో క్యాంపస్‌లను అందుబాటులోకి తెస్తే డిమాండ్ మరింత పెరుగుతుందని యాజమాన్యం అంచనా వేస్తోంది. పరిశ్రమల అవసరాలకు తగ్గట్టుగా ఎఐ , డేటా సైన్స్, పారామెడికల్ . లైఫ్ సైన్సెస్ కోర్సులపై ప్రత్యేక దృష్టి సారిస్తూ ఏపీ విద్యార్థులను ఆకట్టుకునే వ్యూహంతో అడుగులు వేస్తున్నారు.మల్లా రెడ్డి విద్యా సంస్థల ఈ అగ్రెసివ్ నెట్‌వర్క్ విస్తరణతో ఆంధ్రప్రదేశ్‌లోని సంప్రదాయ ప్రైవేట్ కాలేజీలు , కార్పొరేట్ విద్యా సంస్థలకు గట్టి పోటీ ఎదురుకాబోతోంది. పొలిటికల్ ఇమేజ్, బ్రాండ్ మార్కెటింగ్, తక్కువ రుసుములతో కూడిన హామీలు, ప్లేస్‌మెంట్స్ నెట్‌వర్క్‌ను చూపించి ఏపీ ఉన్నత విద్యా మార్కెట్‌లో తమ ఆధిపత్యాన్ని నిలుపుకోవాలని మల్లా రెడ్డి గ్రూప్ చూస్తోంది. రాబోయే రెండు మూడేళ్లలో ఏపీలోని ప్రధాన జిల్లాలన్నింటికీ తమ విద్యా నెట్‌వర్క్‌ను విస్తరించి, రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ తిరుగులేని విద్యా సామ్రాజ్యంగా ఎదగడమే లక్ష్యంగా మల్లా రెడ్డి తన ప్లాన్‌ను అమలు చేస్తున్నారు

# కల్కి 2'లో సుమతి పాత్ర ఏంటి?.. దీపిక ఎగ్జిట్‌తో మరింత ఆసక్తికరంగా మారిన కథ

ప్రభాస్ ప్రధాన పాత్రలో తెరకెక్కిన 'కల్కి 2898 ఎడి' సినిమాకు కొనసాగింపుగా రాబోతున్న 'కల్కి 2'పై ప్రేక్షకుల్లో భారీ ఆసక్తి నెలకొంది. తొలి భాగంలో కీలకంగా నిలిచిన సుమతి పాత్ర సీక్వెల్‌లో ఎలా ఉండబోతోందన్న అంశం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఈ పాత్రను తొలి సినిమాలో దీపికా పదుకొణే పోషించగా.. ఆమె సీక్వెల్ నుంచి తప్పుకోవడంతో సుమతి పాత్ర భవితవ్యంపై పలు ఊహాగానాలు వినిపిస్తున్నాయి.

**సుమతి పాత్ర చుట్టూనే తొలి భాగం కథ**

'కల్కి 2898 ఎడి' కథలో సుమతి పాత్రకు ప్రత్యేక ప్రాధాన్యం ఉంది. ఆమె గర్భంలో పెరుగుతున్న శిశువు భవిష్యత్తులో కల్కి అవతారంగా మారుతాడనే అంశాన్ని కథలో కీలకంగా చూపించారు. దీంతో సుమతిని రక్షించేందుకు జరిగే ప్రయత్నాలు, ఆమెను వెంబడించే శక్తుల మధ్య సంఘర్షణ కథలో ప్రధాన అంశంగా నిలిచింది.



దీపికా పదుకొణే ఈ పాత్రలో నటించారు. అయితే 'కల్కి 2' నిర్మాణానికి సంబంధించిన విషయాల్లో ఆమె ప్రాజెక్ట్ నుంచి బయటకు వచ్చినట్లు వార్తలు వచ్చాయి. దీంతో సుమతి





పాత్రను కొనసాగించేందుకు మరో నటిని ఎంపిక చేస్తారా? లేక తొలి భాగంలోనే ఉన్న దృశ్యాలతో పాత్రను ముగిస్తారా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

**కొత్త పాత్రలు ఉండవన్న దర్శకుడి వ్యాఖ్యలు**

'కల్కి 2'లో కొత్తగా పెద్దగా కొత్త పాత్రలను పరిచయం చేయడం లేదని దర్శకుడు నాగ్ అశ్విన్ చేసిన వ్యాఖ్యలు ఈ చర్చకు మరింత ప్రాధాన్యం తెచ్చాయి. తొలి భాగంలో పరిచయమైన పాత్రలే సీక్వెల్‌లోనూ కొనసాగుతాయని ఆయన పేర్కొన్నట్లు సమాచారం. దీంతో సుమతి పాత్ర విషయంలో చిత్రబృందం ఎలాంటి నిర్ణయం తీసుకుందనే ఆసక్తి పెరిగింది. ఒకవేళ సుమతి పాత్రలో మరో నటిని తీసుకున్నా.. అది కొత్త పాత్ర కాకుండా ఇప్పటికే ఉన్న పాత్రకు కొనసాగింపుగానే పరిగణించే అవకాశం ఉంది.

**కథలో కీలక మలుపు ఉంటుందా?**

దీపికా పదుకొణే తప్పుకోవడం నేపథ్యంలో సుమతి పాత్రను కథ ప్రారంభంలోనే ముగిస్తారా? లేక ఆమె కథను మరో మలుపుతో ముందుకు తీసుకెళ్తారా? అనే విషయంపై ప్రస్తుతం స్పష్టత లేదు. దీనిపై సోషల్ మీడియాలో, సినీ వర్గాల్లో వివిధ రకాల చర్చలు జరుగుతున్నాయి.

మరోవైపు 'కల్కి 2'లో ప్రభాస్ పోషిస్తున్న భైరవ, కమల్ హాసన్ పాత్ర యాస్కిన్, అమితాబ్ బచ్చన్ పోషిస్తున్న అశ్వత్థామ పాత్రల మధ్య సంఘర్షణ మరింత కీలకంగా ఉండబోతుందనే అంచనాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో సుమతి పాత్ర కథలో ఎంతవరకు కొనసాగుతుందనేది ఆసక్తికరంగా మారింది.

**థియేటర్లలోనే అసలు సమాధానం?**

సినిమాకు సంబంధించిన కీలక కథాంశాలను చిత్రబృందం బయటకు రాకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. సుమతి పాత్రకు సంబంధించిన విషయాల్లోనూ ఇప్పటివరకు అధికారికంగా పూర్తి వివరాలు వెల్లడికాలేదు. అందువల్ల ప్రస్తుతం వినిపిస్తున్న అంశాలను ఊహాగానాలుగానే చూడాలి.సుమతి పాత్రకు ఎలాంటి ముగింపు ఇస్తారు? ఆమె కథ 'కల్కి 2'లో ఏ మలుపు తీసుకుంటుంది? అనే ప్రశ్నలకు సినిమా విడుదలైన తర్వాతే స్పష్టమైన సమాధానం లభించే అవకాశం ఉంది. ఇప్పటికే 'కల్కి 2'పై ఉన్న అంచనాలకు ఈ అంశం మరింత ఆసక్తిని జోడిస్తోంది.

## వన్డేల్లో రోహిత్ శర్మ అరుదైన ఘనత.. 12 వేల పరుగుల క్లబ్‌లో హిట్‌మ్యాన్

ఈ ఘనత సాధించిన భారత మూడో క్రికెటర్‌గా రికార్డ్

వేగంగా ఈ మైలురాయి చేరిన రెండో ఆటగాడిగా హిట్‌మ్యాన్

సచిన్, కోహ్లీల తర్వాత ఈ క్లబ్‌లో చేరిన భారత బ్యాటర్

గౌహతిలో వెస్టిండీస్‌తో జరిగిన మ్యాచ్‌లో ఈ ఘనత



భారత క్రికెట్ జట్టు కెప్టెన్ రోహిత్ శర్మ తన పేరిట మరో అరుదైన మైలురాయిని లిఖించుకున్నాడు. వన్డే క్రికెట్‌లో 12,000 పరుగుల మార్కును అధిగమించాడు. గువాహటి బర్సపరా స్టేడియంలో వెస్టిండీస్‌తో బుధవారం జరిగిన రెండో వన్డేలో ఈ ఘనత సాధించాడు. ఈ అరుదైన క్లబ్‌లో చేరిన మూడో భారత బ్యాటర్‌గా, ప్రపంచవ్యాప్తంగా ఏడో ఆటగాడిగా నిలిచాడు.

రోహిత్ శర్మ కేవలం 282 ఇన్నింగ్స్‌లలోనే 12 వేల పరుగుల మైలురాయిని చేరుకోవడం గమనార్హం. తద్వారా వన్డేల్లో అత్యంత వేగంగా ఈ ఘనతను అందుకున్న రెండో ఆటగాడిగా అతను రికార్డు నెలకొల్పాడు. ఈ జాబితాలో విరాట్ కోహ్లీ (242 ఇన్నింగ్స్‌లు) అగ్రస్థానంలో ఉండగా, 300 ఇన్నింగ్స్‌లలో ఈ ఫీట్ సాధించిన సచిన్ టెండూల్కర్‌ను రోహిత్ అధిగమించాడు. భారత ఆటగాళ్లలో సచిన్, కోహ్లీ తర్వాత ఈ మైలురాయిని చేరిన క్రికెటర్‌గా రోహిత్ శర్మ నిలిచాడు. ప్రస్తుత మ్యాచ్‌లో అద్భుతమైన ఫామ్‌ను కనబరిచిన రోహిత్, అర్ధ సెంచరీతో రాణించాడు. తన కెరీర్‌లో ఇప్పటివరకు అతను 34 సెంచరీలు, 62 అర్ధ సెంచరీలు నమోదు చేశాడు. వన్డేల్లో మూడు డబుల్ సెంచరీలు బాదిన ఏకైక ఆటగాడిగా, అత్యధిక వ్యక్తిగత స్కోరు (264 నాటౌట్) సాధించిన బ్యాటర్‌గా రోహిత్ పేరిట అసాధారణ రికార్డులు ఉన్నాయి.

## హాకీలో ఫైనల్‌కు దూసుకెళ్లిన భారత్.. కొరియాకు షాక్, గోల్డ్ కోసం చైనాతో పోరు!

జపాన్ వేదికగా జరుగుతున్న 2026 ఆసియా క్రీడలలో భారత మహిళల హాకీ జట్టు అద్భుత ప్రదర్శనతో చరిత్ర సృష్టించింది. ఉత్కంఠభరితంగా సాగిన సెమీఫైనల్ పోరులో పటిష్టమైన దక్షిణ కొరియా జట్టును 2-0 గోల్స్ తేడాతో ఓడించి ఘన విజయం సాధించింది. ఈ విజయంతో సలీమా టెటే నేతృత్వంలోని భారత వనితలు నేరుగా ఫైనల్‌లోకి ప్రవేశించడమే కాకుండా, స్వర్ణ పతకం కోసం చైనాతో తలపడేందుకు రెడీ అయ్యారు.

**ఇషికా గోల్‌తో వీడిన డెడ్‌లాక్.. అదరగొట్టిన ఇండియా:**

మొదటి మూడు క్వార్టర్ల పాటు ఇరు జట్ల మధ్య నువ్వా నేనా అన్నట్లు హోరాహోరీగా సాగిన ఈ మ్యాచ్‌లో సౌత్ కొరియా డిఫెన్స్ చాలా పటిష్టంగా ఉండడంతో ఎలాంటి గోల్స్ నమోదు కాలేదు. కానీ మ్యాచ్ తారాస్థాయికి చేరుకున్న తరుణంలో.. 44వ నిమిషంలో టీమిండియా ప్లేయర్ ఇషికా అద్భుతమైన గోల్ సాధించి జట్టుకు గోల్స్ ఖాతా తెరిచింది. సుదీర్ఘంగా కొనసాగిన డెడ్‌లాక్‌ను బ్రేక్ చేసిన ఈ గోల్ మ్యాచ్ స్వరూపాన్ని పూర్తిగా మార్చేసింది.

**కెప్టెన్ సలీమా టెటే సూపర్ రన్.. భారత్ డబుల్ లీడ్:**

ఇక ఆ తరువాత నాలుగో, చివరి క్వార్టర్‌లో భారత జట్టు మరింత దూకుడు పెంచింది. జట్టు కెప్టెన్ సలీమా టెటే మిడ్-ఫీల్డ్ నుంచి ఎంతో చాకచక్యంగా డ్రిబ్లింగ్ చేస్తూ కొరియా షూటింగ్ సర్కిల్‌లోకి మెరుపు వేగంతో దూసుకెళ్లింది. ఆమె సృష్టించిన అద్భుతమైన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ ఇండియా ఆధిక్యాన్ని 2-0కి పెంచారు. చివరి వరకు ప్రత్యర్థికి ఎలాంటి అవకాశం ఇవ్వకుండా అద్భుతమైన డిఫెన్స్‌తో మ్యాచ్‌ను కైవసం చేసుకున్నారు.

**స్వర్ణ పతక పోరులో చైనాతో ఢీ:**

ఈ సెమీఫైనల్ విజయంతో ఆసియా క్రీడల ఫైనల్‌కు దూసుకెళ్లిన భారత జట్టు, పసిడి పతకం కోసం చైనా జట్టుతో తలపడనుంది. గ్రూప్ దశ నుంచి అజేయంగా దూసుకొస్తున్న ఇండియన్ హాకీ అమ్మాయిలు, ఫైనల్‌లోనూ అదే జోరును కొనసాగించి దేశానికి స్వర్ణ పతకం అందించాలని కోట్లాది మంది భారతీయులు కోరుకుంటున్నారు.






Printed By Published By Gantyada Apparao On Behalf Of Gantyada Apparao, Printed At Sri Sai Ganga Printers And Publishers, Flat No : 504, Bharat Towers, 5th Lane Dwarakanagar, Visakhapatnam, Andhra Pradesh - 530016, And Published At 1-17-1, Badeti Ramana Street, Near Mla House, 30th Word, Thadepalligudem , Editor Gantyada Apparao. PRGI Registration No. "APTEL/25/A2834, E-Mail : Editorpenpower@Gmail.Com, Mobile: 9059465965